JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రభాత జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఎడిట... ...ఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ ... | మంగళవారం 06-01-2026
Medch... | Tuesday 06-01-2026
Follow: jayabherinews
సంపుటి : 02 | సంచిక : 221
పేజీలు : 8 | వెల : 5
Vol. 02 | Issue 221 | Pages : 8 | ₹: 5

## విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889 call me
jayabheripaper@gmail.com





# భగ్గుమన్న బంగారం

జయభేరి, ముంబై, జనవరి 5 :

బంగారం కొనుగోలు చేయాలనుకునే వారికి మరోసారి గట్టి షాక్ తగిలింది. ఉన్నట్టుండి రాత్రికి రాత్రే ఇంటర్నేషనల్ మార్కెట్లో పసిడి, వెండి ధరలు ఊహించని స్థాయిలో పెరిగాయి. ఇతర అంతర్జాతీయ సంకేతాలు బాగానే ఉన్నప్పటికీ.. 2 రోజుల కిందట అమెరికా తీసుకున్న సంచలన చర్యలు రేట్లు మళ్లీ పుంజుకునేందుకు దారి తీశాయి. దీంతో జీవన కాల గరిష్టాల నుంచి కిందటి వారం ...మిగతాది 2 లో


2 లో

# స్థానికంగా బలపడుతోన్న కమలం

జయభేరి, న్యూఢిల్లీ, జనవరి 5 :

భారతీయ జనతాపార్టీ.. ప్రపంచంలో అత్యధిక సభ్యం త్వం కలిగిన పార్టీ. 12 ఏళ్లుగా దేశంలో అధికారంలో ఉంది. ఉత్తరాది పార్టీగా పదేళ్ల క్రితం వరకు బీజేపీకి ముద్ర ఉండేది. కానీ తర్వాత దక్షిణాదిన కూడా పాగా వేసింది. మహారాష్ట్ర, కర్ణాటకలో అధికారంలోకి వచ్చింది. కేరళ, తెలంగాణ, తమిళనాడులో పాగా వేయాలని ప్రయత్నిస్తోంది. ఇదిలా ఉంటే.. దక్షిణాదిలో బీజేపీ అర్బన్ పార్టీగానే గుర్తింపు ఉంది. కానీ 2025 డిసెంబర్‌లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటింది. ప్రతిపక్ష కాంగ్రెస్‌ను వెనక్కి నెట్టింది. ప్రాంతీయ పార్టీలను మించి సీట్లు గెలిచింది. దీంతో క్షేత్రస్థాయిలో పార్టీ బలపడుతోందన్న సంకేతాలు వస్తున్నాయి. మహారాష్ట్ర, కేరళ, కర్ణాటక, గోవా, అరుణాచల్ ప్రదేశ్‌లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజారిటీ స్థానాల్లో విజయం సాధించింది.



# యాక్టివ్ గా భారతి

జయభేరి, విజయవాడ, జనవరి 5 :

రాజకీయ పార్టీల అధినేతలకు సొంత కుటుంబ సభ్యుల అండ ఉండాలి. ఒకరే రాజకీయం చేస్తామంటే కుదరదు. చంద్రబాబు తన కొడుకు లోకేష్ తో పాటు బావమరిది నందమూరి బాలకృష్ణను తెచ్చుకున్నారు. ఆపై బాలకృష్ణ అల్లుడు శ్రీ భరత్ కూడా ఉన్నారు. భార్య భువనేశ్వరి తో పాటు కోడలు బ్రాహ్మణి అవసరమైన పక్షంలో సాయం అందిస్తున్నారు. తమ్ముడు కుమారుడు నారా రోహిత్ ...మిగతాది 2 లో



# 10 రోజుల్లో మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్!

- మంత్రులు, ఎమ్మెల్యేలను అలర్ట్ చేసిన సీఎం, పీసీసీ చీఫ్..?
- మెజార్టీ వార్డులను దక్కించుకోవాలి
- ఎలక్షన్స్‌కు సిద్ధం కావాలని దిశానిర్దేశం
- పెండింగ్ పనులను పరిష్కరించాలని సూచన
- ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు పూర్తి చేయాలని ఆదేశం

జయభేరి, హైదరాబాద్ :

మరో వారం, పది రోజుల్లో మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ వచ్చే అవకాశం ఉందని మంత్రులు,పార్టీ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలను సీఎం రేవంత్‌రెడ్డి,పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్ అలర్ట్ చేశారు. ఈ లోపే మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల పరిధిలో పెండింగ్‌లో ఉన్న పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. గత నాలుగైదు రోజులుగా తమను కలిసిన మంత్రులు,ఎమ్మెల్యేలు,పార్టీ నేతలకు సీఎం ,పీసీసీ చీఫ్ పలు సూచనలు చేస్తూ.. వారిని అప్రమత్తం చేస్తున్నారు. సిటీలో,పట్టణాల్లో గత కొంత కాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను గుర్తించి, వాటిని త్వరితగతిన పూర్తి చేయడంపై స్థానిక ఎమ్మెల్యేలు దృష్టి పెట్టాలని సూచించారు. మంత్రులు కూడా దీనిపై దృష్టిపెట్టి పార్టీ ఎమ్మెల్యేలు, నేతల నుంచి వస్తున్న ఇలాంటి సమస్యలపై వెంటనే నిధులు విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**మెజార్టీ వార్డులను దక్కించుకోవాలి:**
మున్సిపాలిటీల పరిధిలో పూర్తయిన పనులను వెంటనే ప్రారంభించాలని,చేపట్టాల్సిన పనులకు శంకుస్థాపనలు చేయాలని మంత్రులు, ఎమ్మెల్యేలకు సీఎం,పీసీసీ చీఫ్ సూచించారు. సిటీ,పట్టణ ప్రజల నుంచి వస్తున్న ప్రధాన సమస్యలను పరిష్కరించే దిశగా ఎమ్మెల్యేలు,పార్టీ నేతలు చర్యలు తీసుకోవాలన్నారు. డివిజన్లు,వార్డుల్లో రోడ్లు,డ్రైనేజీలు,స్ట్రీట్ లైట్లు, శానిటేషన్,నల్లా నీళ్లు..ఇలా ప్రజలను నిత్యం ఇబ్బందులు పెడుతున్న సమస్యలను త్వరితగతిన గుర్తించి,పరిష్కరించాలని సూచించారు. పార్టీ ఎమ్మెల్యేలు,నియోజకవర్గ ఇన్‌చార్జీలు తమ పరిధిలోని పట్టణాలపైపది రోజులు ప్రత్యేక దృష్టి పెట్టాలని, డివిజన్లలో,వార్డుల్లో విస్తృతంగా పర్యటిస్తూ ప్రజల ఇబ్బందులను అడిగి తెలుసుకోవాలని ఆదేశించారు. ప్రతి కార్పొరేషన్,మున్సిపాలిటీలో మెజార్టీ వార్డులను కాంగ్రెస్ దక్కించుకునేలా ఇప్పటి నుంచే ఇటు పార్టీ బలోపేతంపై,అటు ప్రజా సమస్యల పరిష్కారంపై చొరవ చూపాలని మంత్రులు, ఎమ్మెల్యేలు,నియోజకవర్గ ఇన్‌చార్జీలను సీఎం, పీసీసీ చీఫ్ కోరారు. పంచాయతీ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలను మించి మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు సీట్లు రావాలన్నారు. ఈ ఫలితాల ఆధారంగానే రాబోయే రోజుల్లో నేతల రాజకీయ భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని అన్నారు.

# వ్యక్తిగా వెళ్తున్నా.. శక్తిగా వస్తా..



- తెలంగాణ జాగృతి రాజకీయ పార్టీ
- రాష్ట్రంలో ఒక కొత్త రాజకీయ వేదిక రాబోతుంది
- నా ఇద్దరు బిడ్డలమీద ప్రమాణం.. కవిత

2 లో

జయభేరి, హైదరాబాద్, జనవరి 5 :

రాజకీయ పార్టీగా అవతరిస్తుందని, అందరూ తనను ఆశీర్వదించాలని కవిత విజ్ఞప్తి చేశారు. శాసనమండలిలో ఆమె మాట్లాడుతూ, తెలంగాణ జాగృతి రాజకీయ పార్టీగా మారబోతోందని, రాబోయే ఎన్నికల్లో తప్పకుండా పోటీ చేస్తామని ప్రకటించారు. కచ్చితంగా గొప్ప రాజకీయ శక్తిగా ఎదుగుతానని ఆమె ధీమా వ్యక్తం చేశారు. "వ్యక్తిగా సభ నుంచి వెళుతున్నా.. రాజకీయ శక్తిగా తిరిగి వస్తా" అని కవిత ప్రతిజ్ఞ చేశారు. ఉద్యమ ద్రోహులకు బీఆర్ఎస్ రాజకీయ పునరావాస కేంద్రంగా మారిందని ఆమె ఆరోపించారు. రాష్ట్రంలో ఒక కొత్త రాజకీయ వేదిక రాబోతుందని, విద్యార్థులు, నిరుద్యోగులు, అన్ని వర్గాల కోసం తాను పనిచేస్తానని హామీ ఇచ్చారు. "అవమాన భారంతో పుట్టింటి నుంచి అన్ని బంధనాలు తెంచుకుని మీకోసం వస్తున్నా.. ఆశీర్వదించండి. తెలంగాణ జాగృతి రాజకీయ పార్టీగా మారుతుంది" అని ఆమె పేర్కొన్నారు.సభ నుంచి బయటకు వచ్చాక కవిత మీడియాతో మాట్లాడారు. ఉద్యమకారుల కోసం, వారి ఆశయాల కోసం తెలంగాణ జాగృతి పార్టీ పనిచేస్తుందని అన్నారు. ఉద్యమకారులను, అమరవీరుల కుటుంబాలను తెలంగాణ జాగృతిలోకి ఆహ్వానిస్తున్నానని ఆమె అన్నారు. అవినీతి, రైతుల మీద కేసులు, బీఆర్ఎస్ సొంత నాయకులపై కేసులు, ఇంకా మరెన్నో బీఆర్ఎస్‌లో జరిగిన అక్రమాల గురించి తాను అధినాయకత్వం దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదని అన్నారు. కుట్రదారులు, తెలంగాణ ద్రోహులు గెలిచారని మండిపడ్డారు. కానీ బీఆర్ఎస్ కోసం కడుపు కట్టుకుని పని చేసిన ఏ నాయకుడు ఉండలేకపోయారని అన్నారు. తాను ఊరుకునే వ్యక్తిని కాదని, కొట్లాడే ఆడబిడ్డనని అన్నారు. నాడు బీఆర్ఎస్ పార్టీ చేసిన అన్యాయాన్ని నేడు కాంగ్రెస్ కూడా కొనసాగిస్తోందని ఆరోపించారు. అందుకే తెలంగాణలో ఒక రాజకీయ వేదిక అవసరమని, తెలంగాణ జాగృతి ఆ ఖాళీని పూర్తి చేస్తుందని అన్నారు.


7 లో

## మేడిపల్లిలో ఉప్పల్ కోర్టు కాంప్లెక్స్ లో లావాదేవీలు..

# కూర్చొని మాట్లాడుకోండి

- తెలుగు రాష్ట్రాలకు సుప్రీం హితవు



జయభేరి, న్యూఢిల్లీ, జనవరి 5 :

దశాబ్దాలుగా సాగుతున్న తెలుగు రాష్ట్రాల జల జగడం ఇప్పుడు దేశ అత్యున్నత న్యాయస్థానం గడప తట్టింది. పోలవరం నల్లమల సాగర్ ప్రాజెక్టు నిర్మాణంపై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య నెలకున్న వివాదం సోమవారం సుప్రీంకోర్టులో విచారణ రసవత్తరంగా సాగింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ వివాదాన్ని పరిష్కరించేందుకు మధ్యవర్తిత్వం అనే కొత్త మార్గాన్ని సూచించడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇరు రాష్ట్రాల వాదనలు విన్న న్యాయస్థానం, కేవలం న్యాయపరమైన పోరాటాల కంటే పరస్పర చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవడమే శ్రేయస్కరమని అభిప్రాయపడింది.

**తెలంగాణ వాదన:** మా వాటాకు గండి పడుతుంది. తెలంగాణ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ తన వాదనలను బలంగా వినిపించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వరద జలాల వినియోగం ...మిగతాది 2 లో

# ప్రపంచంలో తెలుగు జాతి నెంబర్-1

- దీనికి నేను కట్టుబడి ఉన్నాను
- తెలుగు జాతి నెంబర్-1గా ఉండాలంటే...
- మనలో ఐకమత్యంగా ఉండాలి


2 లో

జయభేరి, గుంటూరు :

గుంటూరులో 3వ ప్రపంచ తెలుగు మహాసభల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొని మాట్లాడారు. తెలుగు ప్రజలకు రెండు రాష్ట్రాలున్నా... తెలుగే మాతృభాష. రెండు రాష్ట్రాలు కలిసి ఉంటే ఎన్నో సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. ఎన్టీఆర్ సీఎం అయ్యాకే... సాగర్ జలాలను ఉపయోగించుకునేలా ఎస్ఎల్బీసీ, ఎస్ఆర్బీసీ ప్రాజెక్టులు తెచ్చారని అన్నారు. కల్వకుర్తి లిఫ్ట్, ఎఎమ్మార్ ఎత్తిపోతల, నెట్టెంపాడు వంటి ప్రాజెక్టులను నేను పూర్తి చేశాను. కృష్ణా డెల్టా మోడ్రనైజేషన్ పేరుతో నీటిని పొదుపు చేసి... ఆ నీటిని తెలంగాణకు కేటాయించి బీమా లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తి చేశాం. గోదావరి నదిపై గుత్ప, అలీసాగర్, దేవాదుల ఎత్తిపోతల వంటి పథకాలను చేపట్టాం. ఆంధ్ర ప్రాంతంలో చాగల్నాడు, పుష్కర, తాటిపూడి వంటి లిఫ్ట్ ప్రాజెక్టులు తెచ్చాం. పట్టిసీమ ప్రాజెక్టుతో కృష్ణా డెల్టాకు నీరిచ్చాం. విభజన తర్వాత పోలవరానికి ప్రత్యేక నిధులిచ్చారు, ప్రత్యేక చట్టం రూపొందించారు. గతేడాది సుమారు కృష్ణా, గోదావరి నదుల నుంచి 6,282 టీఎంసీల నీరు సముద్రంలోకి వెళ్లాయి. గోదావరి నీళ్లు పుష్కలంగా ఉన్నాయి... గోదావరి నీళ్లను తెలంగాణ వాడుకున్నా అడ్డు చెప్పలేదు.

# హరీష్ రావుకు ఊరట



జయభేరి, హైదరాబాద్, జనవరి 5 :

తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావుకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. హరీష్ రావుతో పాటు, మాజీ పోలీస్ అధికారి రాధాకిషన్ రావులకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్లను విచారించిన జస్టిస్ బి.వి. నాగరత్న నేతృత్వంలోని ధర్మాసనం, వాటిని కొట్టివేసింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో గతంలో ఉన్న ఆదేశాలను పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు, తెలంగాణ హైకోర్టు ...మిగతాది 2 లో

▸▸ మొదటిపేజీ తరువాయి

## కూర్చొని మాట్లాడుకోండి

పేరుతో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు. ముఖ్యంగా గోదావరి నదిలో తెలంగాణకు ఉన్న 968 టీఎంసీల నీటి వాటాకు ఈ ప్రాజెక్టు వల్ల ముప్పు పొంచి ఉందని ఆయన కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. విభజన తర్వాత ఏర్పడిన కొత్త రాష్ట్రంగా తెలంగాణకు తన నీటి అవసరాలు ఉన్నాయి. ఏపీ ప్రభుత్వం ఏకపక్షంగా, ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండా ఈ ప్రాజెక్టును చేపడుతోంది. కేంద్ర జల సంఘం ఇచ్చిన ఆదేశాలను కూడా ఏపీ పట్టించుకోవడం లేదు అని సింఘ్వీ వాదించారు. అంతే కాకుండా ఈ ప్రాజెక్టుపై తక్షణమే స్టే ఇవ్వాలని, లేని పక్షంలో తెలంగాణ ప్రయోజనాలకు తీవ్ర విఘాతం కలుగుతుందని ఆయన మధ్యంతర ఉపశమనాన్ని కోరారు.
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి గట్టిగా బదులిచ్చారు. ఈ ప్రాజెక్టు ఇంకా ప్రాథమిక దశలోనే ఉందని, కేవలం డీపీఆర్, సర్వేల కోసం మాత్రమే టెండర్లు పిలుస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. నా ఇల్లు నేను కట్టుకుంటే పక్కవారికి అభ్యంతరం ఏంటి అనే ఆసక్తికరమైన ఉదాహరణతో రోహత్గి తన వాదన వినిపించారు. రాయలసీమ వంటి కరవు ప్రాంతాలకు నీటిని అందించడమే తమ లక్ష్యమని ఇందులో ఎలాంటి ఉల్లంఘనలు లేవని స్పష్టం చేశారు. సముద్రంలోకి వృథాగా పోతున్న జలాలను వాడుకోవడమే తమ ఉద్దేశమని, ఇది జాతీయ ప్రాజెక్టు కాదని, కేవలం రాష్ట్ర అవసరాల కోసం చేస్తున్న ప్లానింగ్ మాత్రమేనని ఏపీ వాదించింది. తెలంగాణ కూడా గోదావరిపై వేర్వేరు ప్రాజెక్టులు నిర్మిస్తోందని ఏపీ తరఫున మరో న్యాయవాది జగదీప్ గుప్తా కోర్టుకు వివరించారు. ఇరు పక్షాల వాదనలు విన్న జస్టిస్ సూర్యకాంత్ కొన్ని కీలకమైన ప్రశ్నలు అడిగారు. ప్రాజెక్టు ఇంకా ప్లానింగ్ దశలోనే ఉన్నప్పుడు అభ్యంతరాలు ఎందుకు, ఒకవేళ ప్లానింగ్ డాక్యుమెంటేషన్ విఫలమైతే ఏపీ నిధులే వృథా అవుతాయి కదా, అని అనుమానం వ్యక్తం చేశారు. ప్రాజెక్టులు నిర్మించే సమయంలో పరివాహక ప్రాంత రాష్ట్రాల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవడం అవసరమని సీజేఐ సూచించారు. ఈ చిక్కుముడి విప్పడానికి సుప్రీంకోర్టు మూడు ప్రధాన పరిష్కారాలను ఇరు రాష్ట్రాల ముందు ఉంచింది. ఇప్పటికే కేంద్రం ఏర్పాటు చేసిన కమిటీకి తెలంగాణ అభ్యంతరాలను పరిశీలించే అధికారం ఇవ్వడం. అవసరమైతే ప్రాజెక్టును నిలిపివేసే నిర్ణయాధికారాన్ని కూడా ఆ కమిటీకే అప్పగించడం మధ్యవర్తిత్వం: ఇరు రాష్ట్రాలూ కూర్చొని చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవడం జాతీయ ప్రాజెక్టుల విషయంలో కేంద్ర ప్రభుత్వానికి న్యాయపరిధి ఉంటుందని గుర్తు చేస్తూ, మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కారం వెతకాలని సీజేఐ కోరారు. అయితే సుప్రీంకోర్టు సూచించిన ఈ ప్రతిపాదనలపై తమ నిర్ణయాన్ని తెలియజేయడానికి తెలంగాణ ప్రభుత్వం సమయం కోరింది. దీంతో ధర్మాసనం తదుపరి విచారణను ఈ నెల 12వ తేదీకి వాయిదా వేసింది.

## ప్రపంచంలో తెలుగు జాతి నెంబర్1

విభజన తర్వాత కాళేశ్వరం ప్రాజెక్టు కట్టినా అభ్యంతరం చెప్పలేదు. ప్రతేడాది గోదావరి నుంచి సముద్రంలోకి 3వేల టీఎంసీల నీళ్లు వృథాగా పోతున్నాయి. కృష్ణాగోదావరి నదులు అనుసంధానం జరుగుతుంది. ఏపీలోని నదులన్నిటినీ అనుసంధానించాం. తెలుగు రాష్ట్రాల మధ్య విద్వేషాలు ఉండకూడదు అన్నారు. ఇది రాజకీయ వేదిక కాదు కాబట్టి... అన్నీ మాట్లాడ్డం లేదు.. ఐక్యత గురించే మాట్లాడతాను. నీటి విషయంలోనైనా, సహకారం విషయంలోనైనా తెలుగువారంతా కలిసి ఉండాలి. ప్రపంచ మహాసభలకు హాజరైన ఉపాధ్యాయులకు ఆన్ డ్యూటీగా పరిగణిస్తాం. విలువలు నేర్పేది సంస్కృతి.. ఆ సంస్కృతి మూలం భాష.. అందుకే భాషాభివృద్ధికి నేను పూర్తి సహకారం ఇస్తాను. వివిధ దేవాలయాల్లో ఆస్థాన విద్వాంసులను, ఆస్థాన కవులను నియమించాలని కోరారు.. దానిపై నిర్ణయం తీసుకుంటాం. మాతృభాషాభివృద్ధికి, తెలుగు జాతి ఔన్నత్యానికి పూర్తిగా సహకరిస్తామని అన్నారు.

## భగ్గుమన్న బంగారం

పసిడి, వెండి రేట్లు భారీగా దిగి రాగా.. ఇప్పుడు మళ్లీ ఒక్కసారిగా ఎగబాకాయి. దీంతో రేట్లు ఇంకా పెరుగుతాయేమోనని ఆందోళన వ్యక్తం అవుతోంది యావత్ ప్రపంచానికి షాక్ ఇచ్చిన సంగతి తెలిసిందే. వెనెజువేలాపై దాడులు జరిపి.. ఆ దేశ అధ్యక్షుడు నికోలస్ మధురోను బంధించింది. అక్కడి అధ్యక్ష భవనం నుంచి అమెరికాకు తీసుకొచ్చింది. ఇదే సమయంలో అక్కడ అమెరికా కంపెనీలు పెట్టుబడులు పెట్టి అభివృద్ధి చేస్తాయని ప్రకటించారు. అయితే అకస్మాత్తుగా వెనెజువెలాపై ట్రంప్ సర్కార్ విరుచుకుపడటంతో యావత్ ప్రపంచమే ఆశ్చర్యపోయింది. దీంతో మరోసారి అంతర్జాతీయంగా తీవ్ర అనిశ్చితి నెలకొంది. ఇటీవల రష్యా ఉక్రెయిన్ యుద్ధం ఒక కొలిక్కి వస్తుందన్న అంచనాలతో గోల్డ్, సిల్వర్ రేట్లు కాస్త దిగి రాగా.. ఇప్పుడు అమెరికా వెనెజువెలా సంఘర్షణతో మొదటికొచ్చింది.ఇంటర్నేషనల్ మార్కెట్లో 6 గంటల వ్యవధిలో బంగారం, వెండి రేట్లు రికార్డ్ స్థాయిలో ఎగబాకాయి. ఇక అర్ధరాత్రి 12 దాటిన తర్వాత రేట్లు అదే స్థాయిలో పెరుగుతూ పోయాయి. కిందటి రోజు అంతర్జాతీయ మార్కెట్లో స్పాట్ గోల్డ్ రేటు ఔన్సుకు 4330 డాలర్ల స్థాయిలో ఉండగా.. ఇప్పుడు అది మళ్లీ 4410 డాలర్ మార్కు దాటి దూసుకెళ్తుంది. అంటే 6 గంటల్లోనే ఏకంగా 80 డాలర్లకు పైగా పెరిగింది. స్పాట్ సిల్వర్ రేటు కూడా.. ఔన్సుకు 72 డాలర్ల స్థాయి నుంచి.. 76 డాలర్ల మార్కును తాకింది. ఇంటర్నేషనల్ మార్కెట్లో ధరల పెంపు ప్రభావం దేశీయంగా.. ఉదయం 10 గంటల తర్వాత కనిపిస్తుంది.ప్రస్తుతం మాత్రం దేశీయంగా బంగారం, వెండి రేట్లు స్థిరంగానే ఉన్నాయి. హైదరాబాద్ నగరంలో 22 క్యారెట్స్ గోల్డ్ రేటు తులం రూ.. 1,24,500 వద్ద ఉంది. జనవరి 3న ధర తగ్గగా.. దానికి ముందు 1,2 తేదీల్లో పెరిగింది. ఇక 24 క్యారెట్ల పసిడి ధర 10 గ్రాములకు ప్రస్తుతం హైదరాబాద్ మార్కెట్లో రూ. 1,35,820 వద్ద ఉంది. ఇక వెండి ధర ప్రస్తుతం కిలోకు రూ. 2.57 లక్షల వద్ద ఉంది. దీనికి ముందు జనవరి 3న రూ. 3 వేలు తగ్గగా.. జనవరి 2న రూ. 4 వేలు పెరిగింది.

## స్థానికంగా బలపడుతోన్న కమలం

మహారాష్ట్రలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో 117 స్థానాలతో ముందంజలో నిలిచింది. మిత్ర పక్షాలు ఈక్‌నాథ్ శిండే శివసేన, అజిత్ పవార్ ఎన్‌సీపీ కలిసి 200+ సీట్లు సాధించాయి. మహాఘట్‌బంధన్‌కు 37 మాత్రమే వచ్చాయి. ఈ మైత్రి విజయం బీజేపీ దక్షిణ, పశ్చిమ రాష్ట్రాల్లో బలపడుతుందనడానికి నిరద్శనం. కర్ణాటకలో అధికార పార్టీకి షాక్.. కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో పట్టణ స్థానిక సంస్థల్లో బీజేపీ 40 సీట్లతో ఆధిక్యం చెప్పింది. కాంగ్రెస్ 23, జేడీఎస్ ఒకటి, స్వతంత్రులు 2 మాత్రమే గెలిచారు. అధికార పార్టీని కాదని అక్కడి ఓటర్లు బీజేపీకి స్థానిక సంస్థల్లో అవకాశం కల్పించారు.
ఉత్తరాది రాష్ట్రం గోవాలో పంచాయతీ ఎన్నికలు జరిగాయి. ఇక్కడ బీజేపీ-మహారాష్ట్రవాది గోమంతక్ పార్టీ కూటమి 32 సీట్లు సాధించింది. కాంగ్రెస్ 10, ఆప్ 1, స్వతంత్రులు 4. అధికార బీజేపీ స్థానిక స్థాయిలో బలపడినట్టు నిదర్శనం.
అరుణాచల్‌లో జిల్లా కౌన్సిల్‌లో బీజేపీ 170 సీట్లు, పంచాయతీల్లో 6,085 సీట్లు గెలిచాయి. పీపీఏ 648, ఎన్‌పీపీ 160, స్వతంత్రులు 627, కాంగ్రెస్ 216 గెలిచాయి. ఈశాన్య రాష్ట్రంలో బీజేపీ ఆధిపత్యం పెరగడం గమనార్హం.
కేరళ పంచాయతీల్లో యూడీఎఫ్ 505, ఎల్‌డీఎఫ్ 345, స్వతంత్రులు 64, బీజేపీ 26 సీట్లు గెలిచాయి. తిరువనంతపురం మున్సిపాలిటీలో బీజేపీ గణనీయ పురోగతి చెందింది. గతంతో పోలిస్తే చాలా పంచాయతీల్లో బీజేపీ విజయం షాధించింది. ఈ ఎన్నికలు బీజేపీ అట్టడుగుస్థాయి బలాన్ని చూపుతున్నాయి. అధికారంలో లేని రాష్ట్రాల్లో కూడా బీజేపీ బలపడింది. 2024 లోక్‌సభ తర్వాత పార్టీ స్థానిక స్థాయిలో దృష్టి పెట్టి, దక్షిణ-ఈశాన్యంలో పట్టు పెంచుకుంది. తెలంగాణలో కూడా ఇదే ట్రెండ్ కొనసాగుతోంది.

## యాక్టివ్ గా భారతి

కూడా అందుబాటులో ఉంటున్నారు. పవన్ కళ్యాణ్ కు అండగా అవసరమైన ప్రతి చోట మెగా ఫ్యామిలీ ఉంటుంది. ఇప్పటికే నాగబాబు ప్రత్యక్ష రాజకీయాల్లో ఉన్నారు. అయితే ఒక ప్రాంతీయ పార్టీ మనుగడ సాధించాలంటే కుటుంబ సభ్యుల అండ అధినేతకు అవసరం. అయితే ఈ విషయంలో జగన్మోహన్ రెడ్డికి స్పష్టమైన లోటు కనిపిస్తోంది. మొన్నటి వరకు తల్లి విజయమ్మ, చెల్లెలు షర్మిల జగన్మోహన్ రెడ్డికి అండగా నిలబడేవారు. కానీ ఇప్పుడు వారిద్దరూ దూరమయ్యారుజగన్మోహన్ రెడ్డి పార్టీ ఏర్పాటు చేసినప్పుడు రాజశేఖర్ రెడ్డి కుటుంబం అంతా ఆయనకు అండగా నిలుస్తూ వచ్చింది. ఎంతలా అంటే ఆయన జైలుకు వెళ్లిన షర్మిల పాదయాత్ర చేశారు. విజయమ్మ అంతా తానై చూసుకున్నారు. కుటుంబంలో ప్రతి సభ్యుడు ఒక సైనికుడిలా పని చేశారు. 2019 ఎన్నికల వరకు అదే పరిస్థితి కొనసాగింది. కానీ ఆ కుటుంబంలో వ్యక్తిగత వివాదాలు చెలరేగాయి. విజయమ్మ పూర్తిగా రాజకీయాలకు దూరమయ్యారు. షర్మిల కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నారు.

# కర్ణాటక సంగీత రారాజు త్యాగరాజు

- త్యాగరాజ స్వామి 24000 కృతులు, కీర్తనలను రచించి రామార్పణం చేసిన గొప్ప వాగ్గేయకారుడు
- నేడు ఆయన వర్ధంతి



త్యాగరాజు కర్ణాటక సంగీత త్రిమూర్తులలో ఒకరు. త్యాగయ్య, త్యాగబ్రహ్మ అనే పేర్లతో కూడా ప్రసిద్ధుడు. నాదోపాసన ద్వారా భగవంతుని తెలుసుకోవచ్చని నిరూపించిన వాగ్గేయకారుడు. ఆయన కీర్తనలు శ్రీరాముని పై అతనికిగల విశేష భక్తిని, వేదాలపై, ఉపనిషత్తులపై అతనుకున్న జ్ఞానాన్ని తెలియపరుస్తాయి. ఉపనయనం తరువాత తండ్రిగారి బోధలు, 18వ ఏట రామకృష్ణానంద పరబ్రహ్మం ఉపదేశం చేసిన రామ షడక్షరీ మంత్ర ప్రభావం, తల్లి అలవర్చిన భక్తి సంగీతాలు బాల్యంలోనే బీజాంకురాలై త్యాగ రాజ స్వామి వారిలో మూర్తీభవించాయి.ఇతను కర్ణాటక సంగీత త్రయంలో మరో ఇద్దరైన శ్యామశాస్త్రి, ముత్తుస్వామి దీక్షితులకు సమకాలికుడు కూడా. వీరు ముగ్గురూ తమిళనాడులోని, తంజావూరు జిల్లా, తిరువారూరుకు సంబంధించిన వారే. తమిళదేశంలో పుట్టి పెరిగినా వారి గానం ఎక్కువగా తెలుగు, సంస్కృతాల్లోనే సాగింది. రామభక్తులైన శ్రీ త్యాగరాజులవారు 1767 మే 4న రామబ్రహ్మం, సీతమ్మ దంపతులకు 3 వ సంతానంగా తంజావూరు జిల్లాలోని తిరువారూరులో జన్మించారు. వీరి పూర్వీకులు ఆంధ్రప్రదేశ్ లోని ప్రకాశం జిల్లా, కంభం మండలంలోని కాకర్ల గ్రామానికి చెందినవారు. వారు తమిళనాడుకు వలసి వెళ్ళి తిరువారూరు లో స్థిరపడ్డారు. వారికి రామభక్తి , సంగీతం స్వతహాగా తల్లితండ్రులనుండి వచ్చాయి.
తల్లి సీతమ్మ ప్రతిరోజు చేసే రామపంచాయతన పూజలో త్యాగరాజుల వారు పురందర దాస, రామదాస, అన్నమయ్య, నారాయణతీర్థ, జయదేవుల సంకీర్తనలను పాడేవారు. సంస్కృతము, తెలుగు, ఇతర శాస్త్రాలను తండ్రి వద్ద అభ్యసించారు. రామాయణ మహాభారతాలను ఆపోశన పట్టారు. 13 యేండ్ల చిరు ప్రాయంలో 'నమో నమో రాఘవాయ ' అనే కీర్తనను స్వరపరిచి ఇంటి గోడమీద రాశారు. ఇదే వారి మొదటి సంకీర్తన. త్యాగరాజుకి సంగీతం మీద వున్న శ్రద్ధను గమనించిన తండ్రి, శొంఠి వెంకట రమణయ్య గారి వద్ద సంగీతాభ్యాసానికి చేర్చారు. `ఇంతింతై వటుడింతై' అన్నట్టు వారి సంగీత సముపార్జన దినదిన ప్రవర్ధమానమయింది. శ్రీ రామకృష్ణానంద స్వామివారు వారికి రామతారక మంత్రాన్ని ప్రసాదించారు. 96 కోట్ల రామనామ జపాన్ని త్యాగరాజ స్వామి పూర్తి చేశారు. నారదులవారు కలలో సాక్షాత్కరించగా నారద పంచరత్నాలను రచించారు. ఐహిక సుఖాలపై త్యాగరాజుల వారికి ఏ మాత్రం మక్కువ ఉండేది కాదు. నిరంతరం రామసంకీర్తనామృతంలో మునిగి తేలేవారాయన. త్యాగరాజులోని బాల మేధావిని గుర్తించి వారి గురువుగారు తంజావూరు రాజుకి చెప్పగా, రాజు సంతోషించి అనేక ధన, కనక, వస్తు వాహనాది లాంఛనాలతో సభకు ఆహ్వానించాడు. కాని త్యాగరాజు నిధి చాలా సుఖమా రాముని సన్నిధి సుఖమా అనే సంకీర్తనను పాడి రాజు పంపిన కానుకలను నిర్ద్వంద్వంగా తిరస్కరించాడు. ఈ చర్యకు ఆగ్రహించిన అతని అన్నయ్య జపేశుడు త్యాగరాజు నిత్యం పూజించుకొనే శ్రీ రామ పట్టాభిషేక విగ్రహాలను కావేరి నదిలో విసిరి వేశాడు. శ్రీ రామ వియోగ బాధను తట్టుకోలేని త్యాగరాజు శోకించి, దుఖించి ఆర్త హృదయుడయ్యాడు.
కంచీపురానికి చెందిన ఉపనిషద్ బ్రహ్మేంద్రస్వామి వారి ఆదేశానుసారం తీర్థయాత్రలకు తరలి వెళ్ళారు. తిరుపతి, షోలింగపట్నం, నాగపట్నం, వలాజిపేట, శ్రీరంగం వంటి అనేక పుణ్యక్షేత్రాలను, తీర్థాలను దర్శించి ఆయా పుణ్యక్షేత్రాలలోని మూలవిరాట్లపై భక్తిపారవశ్యం లో ఆసువుగా అనేక కీర్తనలను పాడారు. ఆ పరంపరలో లాల్గుడి పంచరత్నాలు, కోవూరు పంచరత్నాలు, తిరువత్తియార్ పంచరత్నాలు లాంటి గుచ్ఛకృతులు కూడా చేశారు. వారు రచనలను ఎప్పుడూ గ్రంధీకరించలేదు. వారి శిష్యులు వారు పాడుతూండగా వాటిని వ్రాసేవారు. వారికి ఒకనాడు కలలో రాములవారు సాక్షాత్కారమై విగ్రహాల జాడ తెలియజేశారు. ఆ విగ్రహాలను కనుగొని "కనుగొంటిని శ్రీరాముని నేడు" అని భక్తిపారవశ్యంలో ఓలలాడాడు. జానెడు పొట్టనింపుకోవడానికి ధనాపేక్ష యేల అని ఉంఛవృత్తిని స్వీకరించాడు.
త్యాగరాజస్వామి కృతులలో సంగతులను వేయడం, నెరవు పద్ధతిలో కృతులను స్వరపరచడం లాంటి కొత్త ఒరవడులను సంగీత లోకానికి పరిచయం చేశారు. వారి రచనలు పండితపామర జనరంజకంగా సాగాయి. సంగీతాభ్యాసం చేసేవారి స్థాయికి తగినట్లుగా వారు రచనలు చేశారు. కొంతమేరకు సంగీత పరిజ్ఞానం వచ్చిన వారు నేర్చుకోవడానికి వీలుగా 'దివ్య నామ కీర్తనలు' , 'ఉత్సవ సంప్రదాయ కీర్తనలు' చేయగా,కొంత ప్రావీణ్యం సంపాదించిన వారికి తగ్గట్టుగా క్లిష్ట సంగతులతో కూడిన కృతులను చేశారు. దాదాపు 212 రాగాలలో వారి రచనలు సాగాయి. ఘన రాగాలలో చేసిన పంచరత్న కీర్తనలు విశ్వవిఖ్యాతం అయ్యాయి. నౌకాచరితం, ప్రహ్లాద చరిత్ర అనే రెండు గేయ నాటకాలను కూడా చేశారు. త్యాగరాజ స్వామిని వాల్మీకి అవతారంగా భావిస్తారు. వాల్మీకి 24000 శ్లోకాలతో రామాయణం రాస్తే, త్యాగరాజ స్వామి 24000 కృతులు, కీర్తనలను రచించి రామార్పణం చేశారు. అవతార పురుషుడైన శ్రీ త్యాగరాజ స్వామి జనవరి 6 ,1847 న తిరువయ్యారు లో దివ్య సమాధి చెందారు. రామ సంకీర్తనామృతంలో సాగిన ఆ మహా పురుషుని 80 ఏళ్ళ ఆధ్యాత్మిక జీవనం భావి తరాల భారతీయులందరికీ ఆదర్శప్రాయం.

**(పెండ్యాల రామ్ కుమార్, మంథని)**

## వ్యక్తిగా వెళ్తున్నా.. శక్తిగా వస్తా..

ఒక ఆడబిడ్డగా మీ ముందుకు వస్తున్న తనను ఆదరించమని ఆమె కోరారు. ఎప్పుడైనా కొత్త రాజకీయ శక్తి వస్తున్నప్పుడు ఇష్టారీతిన ఆరోపణలు చేయడం సహజమే అన్నారు. తాను బీఆర్ఎస్‌లో వాటాలు కుదరక బయటకు వచ్చానని కాంగ్రెస్ అంటోందని, తనతో కాంగ్రెస్ మాట్లాడుతోందని బీఆర్ఎస్ చెబుతోందని, కానీ ఆ వాదనల్లో వాస్తవం లేదని అన్నారు.తనకు దైవభీతి ఎక్కువ అని, లక్ష్మీనరసింహస్వామి మీద ప్రమాణం చేసి చెబుతున్నానని, తనది ఆస్తుల పంచాయితీ కాదని, రాజకీయ పంచాయితీ అని అన్నారు. తాను బీసీల గురించి, అవినీతి గురించి మాట్లాడానని గుర్తు చేశారు. మండలి ఛైర్మన్ తన రాజీనామాను ఆమోదిస్తే ప్రజల కోసం పూర్తిగా పోరాడతానని అన్నారు.బతుకమ్మ వేడుకలను అడ్డుకునే ప్రయత్నంతో నన్ను కట్టడి చేయాలని ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నారంటూ ఒక్కసారిగా బోరున ఏడ్చేశారు కవిత. ఉబికి వస్తున్న కన్నీళ్లు ఆపుకోలేక ప్రసంగం కొనసాగించారు. నేను ఎక్కడా తెలంగాణ బిడ్డలను, ప్రజలను బాధపెట్టకుండా నవ్వుతూ పనిశాను. నా వద్దకు కాంట్రాక్టర్లు , పెట్టుబడిదారులు లేదు. నిరుపేదలు,ఆశావర్కర్లు, బీడీ కార్మికులు ఇలా అనేక మంది నిరుపేదలు వారి సమస్యల పరిష్కారం కోసం మాత్రమే నా వద్దకు వచ్చారు. జీహెచ్ ఎంసీ కార్మికుల, సింగరేణి ఉద్యోగులు, విద్యుత్ ఉద్యోగులు ఇలా ఎవరు వచ్చినా పనిచేసిపెట్టాను. పార్టీ ఛానెళ్లు , పేపర్లు ఎవరూ నాకు ఎటువంటి మద్దతు ఇవ్వలేదు. తెలంగాణ వచ్చిన 10ఏళ్లలో కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేసుకోలేకపోయాము. నేను పార్టీని ప్రజాసమస్యలపై ప్రశ్నిస్తే తట్టుకోలేకపోయారు. కొందరు నన్ను టార్గెట్ చేశారు.
పార్టీలోని కొందరు కక్షగట్టి బయటకు పంపారు.రాష్ట్రస్థాయి నిర్ణయాల్లో మొదటి నుండి ఎక్కడా నా పాత్ర లేకుండా చేశారు. ధర్నా చౌక్ ను రద్దు చేయడం కూడా దారుణం. రైతులను కూడా అప్పట్లో అక్రమ అరెస్ట్ లు చేశారు. ప్రభుత్వంలో అవినీతిని ఎప్పటికప్పుడు పార్టీ దృష్టికి తీసుకెళ్తే పట్టించుకోలేదు. అమరజ్యోతి నుండి మొదలు సెక్రటేరియట్, అంబేద్కర్ విగ్రహం..అవినీతి జరిగిన మాట ముమ్మాటికి వాస్తవం. కలెక్టరేట్లు సైతం అవినీతితో మునిగిపోయాయి.ఉద్యమకారులను సైతం నిర్లక్ష్యం చేసారు. మనిషికి 10లక్షలు ఇద్దామని చెప్పినా పట్టించుకోలేదు. పెన్షన్ ఇద్దామని చెప్పినా వినలేదు. నీళ్లు,నిధులు,నియామకాలు .. ఇలా అన్ని విషయాల్లోనూ గత ప్రభుత్వంలో అన్యాయం జరిగింది. ఇసుక దందాలు జరిగాయి. దళిత బిడ్డలు బలైపోయారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా చర్యలు తీసుకోకపోవడం దారుణం. బోధన్ షుగర్ ఫ్యాక్టరీ తెరుచుకోకపోవడం దారుణం.కేసీఆర్ దగ్గర మాట్లడే ధైర్యం నాకు మాత్రమే ఉంది. ఆయన క్రింద ఉన్న అనేక మంది వ్యక్తులు తప్పుదోవపట్టిస్తున్నారు. టీఆర్ ఎస్‌ను బీఆర్ ఎస్ గా మార్చే నిర్ణయాన్ని సైతం నేను తీవ్రంగా వ్యతిరేకించాను. ఆరోజు జరిగిన మీటింగ్ కు సైతం నేను వెళ్లలేదు. పేరు మార్పుకు ఒప్పుకోలేదు. తెలంగాణలో ఏం పీకామని ,జాతీయ స్థాయిలోకి వెళతాము. అనేక సమస్యలు ఇంకా ఉన్నాయి. లక్షా 89 కోట్లు ఖర్చుపెట్టినా సాగునీటి ప్రాజక్టులు సరిగా పూర్తి చేయలేకపోయాము. ఈ నిర్ణయాల వల్ల కాంట్రాక్టర్లు బాగుపడ్డారు. ఒకే కంపెనీకి లక్షల కోట్ల ప్రాజెక్టు అప్పగించడం దారుణం. బీజేపి సైతం తెలంగాణను పదేపదే మోసం చేస్తూ వస్తోంది. ఐఐటీ వంటి సంస్థలు తెలంగాణకు ఇవ్వలేదు. ఇక్కడి యువకులకు తీవ్ర అన్యాయం చేశాను. నేను బీజేపీపై పోరాటం చేస్తూనే ఉన్నాను. కేసీఆర్ పై కోపంతో నన్ను జైల్లో పెట్టారు. నన్ను జైల్లో పెట్టినప్పుడు పార్టీ ఎక్కడా అండగా నిలబడలేదు. నేను వారి భావజాలంతో లేనప్పుడు నన్ను తీసేయాలి.కానీ పార్టీలో ఉంచుతూ నన్ను ఒంటరిని చేశారు. కేసీఆర్‌ను ఎవరు విమర్శించినా పట్టిచుకోరు, అదే హరీష్ రావు అంటే నిరసనలు చేస్తారు. ఇదే విషయాలు నేను ప్రెస్ మీట్ పెట్టి చెప్పాను. హరీష్ రావు అవినీతిపై బయటపెట్టానని నాపై పార్టీలో చర్యలు తీసుకున్నాను. బీఆర్ ఎస్ పార్టీ నిబంధనులు పెద్ద జోక్. షోకాజ్ నోటీసు ఇవ్వకుండానే సస్పెండ్ చేయడం దారుణం. కనీసం వివరణ కూడా ఇవ్వలేదు. ఒక పార్టీ నడిపే పద్ధతి ఇది కాదు. బీఆర్ ఎస్ పార్టీ నుండి దూరమవుతున్నందుకు నాకు చాలా సంతోషంగా ఉంది. నా కుటుంబం, నా రక్తం,నా శ్రమ.. నేను 20 ఏళ్లు పార్టీ గుంచి పడ్డ శ్రమ గుర్తించకుండా, కనీసం ఉరితీసే వాడ్నైనా అడుగుతారు. నన్నుమాత్రం అడగలేదు. కాంగ్రెస్ నా సస్పెన్షన్ వాడుకోవాలని చూస్తున్నారు. నాది ఆస్తి పంచాయితీ కాదు, ఆత్మగౌరవ పంచాయితీ.

**నా ఇద్దరు బిడ్డలమీద ప్రమాణం..**

నాది ఆస్తుల పంచాయితీ కాదు, ఆత్మగౌరవ పంచాయితీ, నా ఇద్దరు బిడ్డలమీద ప్రమాణం చేసి చెబుతున్నాను. రాజకీయ నాయకులకు,పార్టీలకు మహిళనేతలపై కనీస గౌరవం లేదు. ఆడవాళ్ల కష్టాలు ఎవరికి చెప్పాలి. మహిళల కోసం పార్టీలు రాజ్యాంగాలు మార్చాలి. పార్టీలు అవకాశం ఇవ్వకపోతే ఎవరు మహిళలను పట్టించుకుంటారు. కేసీఆర్ గారంటే మాకు అపార గౌరవం ఉంది. ఉద్యమకారులకు , కష్టకాలంలో అండగా ఉన్నవారిని అందరినీ ఇలా ఆగం చేస్తారని అనుకోలేదు. ఉద్యమ ద్రోహులకు , రాజకీయ పునరావాస కేంద్రంగా బీఆర్ ఎస్ పార్టీ మారింది. నైతికత లేని పార్టీలో నేను ఉండలేను. ఆ పార్టీ పదవిలో కూడా ఉండలేను. నా రాజీనామా ఆమోదించాలని కోరుతున్నాను. కవిత భావోద్వేగ ప్రసంగం ఆద్యాంతం విన్న మండలి ఛైర్మెన్ మాట్లడుతూ .. మరోసారి ఎమ్మెల్సీ పదవికి రాజీనామాపై ఆలోచన చేయాలని కోరారు. మీ ఆవేదన అర్థం చేసుకున్నాం. భావోద్వేగంతో నిర్ణయాలు సరికాదు. మరోసారి రాజీనామాపై ఆలోచన చేయాలని కోరుతున్నానని అన్నారు. వెంటనే స్పందించిన కవిత ఇప్పటికే నాలుగు నెలలు అయ్యింది. ఇప్పటికే సుధీర్ఘంగా ఆలోచన చేశాను. దయచేసి నా ఎమ్మెల్సీ రాజీనామా ఆమోదించాలని కోరుతున్నట్లు కవిత అన్నారు.

**రాజకీయ పార్టీగా తెలంగాణ జాగృతి**


కల్వకుంట్ల కవిత తన సొంత సంస్థ అయిన 'తెలంగాణ జాగృతి'ని రాజకీయ పార్టీగా మారుస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు. శాసన మండలికి రాజీనామా చేసిన అనంతరం, అమరవీరుల స్తూపం సాక్షిగా ఆమె ఈ కీలక నిర్ణయాన్ని వెల్లడించారు. తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడేందుకు, ప్రజల గొంతుకగా నిలిచేందుకు ఒక కొత్త రాజకీయ శక్తి అవసరం ఉందని, ఆ బాధ్యతను తెలంగాణ జాగృతి తీసుకుంటుంది అని ఆమె స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించిన కవిత, ఆ పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రశ్నిస్తే కక్షగట్టే ధోరణి పెరిగిపోయిందని, తనను ఘోరంగా అవమానించి బయటకు పంపారని ఆరోపించారు. ఈడీ, సీబీఐ కేసుల సమయంలో పార్టీ తనకు అండగా నిలవలేదని, తన సొంత పుట్టిన ఇల్లే తనను చిన్న చూపు చూసిందని వాపోయారు. అందుకే ఆత్మగౌరవం కోసం, ప్రజల పక్షాన నిలబడటం కోసం బంధాలన్నీ తెంచుకుని బయటకు వచ్చినట్లు వివరించారు. కొత్త పార్టీ విధివిధానాల గురించి మాట్లాడుతూ.. సెక్యులర్లు, మావోయిస్టు సానుభూతిపరులు, యువత, నిరుద్యోగులు తనతో కలిసి నడవాలని కవిత పిలుపునిచ్చారు. సామాజిక తెలంగాణే తన లక్ష్యమని, 2029 ఎన్నికల్లో తమ పార్టీ నిర్ణయాత్మక పాత్ర పోషిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం కొనసాగుతున్న జాగృతి జనం బాట యాత్ర ద్వారా ప్రజల సమస్యలను తెలుసుకుంటున్నామని, త్వరలోనే పార్టీ పేరు, జెండా మరియు అజెండాను అధికారికంగా ప్రకటిస్తామని వెల్లడించారు.కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రెండూ మహిళలను, నిరుద్యోగులను మోసం చేశాయని కవిత విమర్శించారు. తెలంగాణలో ప్రస్తుతం ఏర్పడిన రాజకీయ శూన్యతను పూరించేందుకే తాను ఈ అడుగు వేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు, దేవుడి దయతో గొప్ప రాజకీయ శక్తిగా ఎదుగుతాం. చట్టసభల్లో తెలంగాణ ఆత్మగౌరవం కోసం పోరాడుతాం అని ధీమా వ్యక్తం చేశారు.

## హరీష్ రావుకు ఊరట

ఇచ్చిన ఉత్తర్వులలో తాము జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. వీరిపై చర్యలు తీసుకునేందుకు అనుమతి కోరగా సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వానికి నిరాశే ఎదురైంది.గతంలో ఈ వ్యవహారానికి సంబంధించి దాఖలైన ఇతర పిటిషన్లను కూడా తాము కొట్టివేసిన విషయాన్ని జస్టిస్ నాగరత్న ధర్మాసనం ఈ సందర్భంగా గుర్తుచేసింది. ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలపై తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న కొన్ని చర్యలపై హైకోర్టు గతంలో స్టే ఇవ్వడం లేదా కొన్ని వెసులుబాట్లు కల్పించడం తెలిసిందే. ఆ ఆదేశాలను సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించగా, అత్యున్నత న్యాయస్థానం హైకోర్టు నిర్ణయంలో జోక్యం చేసుకోలేమని పేర్కొంటూ తెలంగాణ ప్రభుత్వ అభ్యర్థనను తోసిపుచ్చింది.
ఫోన్ ట్యాపింగ్ కేసు బ్యాక్‌గ్రౌండ్..
గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ప్రతిపక్ష నాయకులు (కాంగ్రెస్, బీజేపీ), వ్యాపారవేత్తలు, కొందరు సెలబ్రిటీల ఫోన్లను అక్రమంగా ట్యాప్ చేశారనే ఆరోపణలు వచ్చాయి. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఫిర్యాదు రావడంతో తెలంగాణ ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్ అంశంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. ఈ కేసులో స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (SIB) మాజీ చీఫ్ ప్రభాకర్ రావు, మాజీ డీఎస్పీ ప్రణీత్ రావు, రాధాకిషన్ రావు వంటి కీలక అధికారులు ప్రధాన నిందితులుగా ఉన్నారు.హరీష్‌రావు ప్రమేయంపై ఆరోపణలు: ఫోన్ ట్యాపింగ్ ద్వారా సేకరించిన సమాచారాన్ని రాజకీయ లబ్ధి కోసం ఉపయోగించుకున్నారని హరీష్ రావుపై ప్రభుత్వం ఆరోపణలు చేసింది. కేసు దర్యాప్తును వేగవంతం చేసేందుకు విచారించేందుకు అనుమతి ఇవ్వాలని రాష్ట్ర ప్రయత్నం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీని వెనుక కేటీఆర్, కేసీఆర్ లాంటి గత ప్రభుత్వ కీలక నేతలు ఉన్నారని త్వరలోనే నిజాలు బయట పెడతామని కాంగ్రెస్ నేతలు, రాష్ట్ర ప్రభుత్వం అంటోంది.హైకోర్టు స్టే: ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ ప్రక్రియలో భాగంగా కొందరిపై ప్రస్తుతానికి చర్యలు తీసుకోకుండా తెలంగాణ హైకోర్టు గతంలో మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం సుప్రీంకోర్టు సైతం హైకోర్టు తీర్పును గౌరవిస్తూ తెలంగాణ సర్కార్ పిటిషన్లను కొట్టివేసింది. దాంతో ఈ కేసులో హరీష్ రావు, రాధాకిషన్ రావులకు ప్రస్తుతానికి ఊరట లభించింది. గతంలోనూ ఈ కేసుకు సంబంధించి దాఖలైన పిటిషన్లను తాము కొట్టివేశామని విచారణ సందర్భంగా నాగరత్న ధర్మాసనం గుర్తుచేసింది.

# యాదగిరిగుట్టలో మహిళా క్యాంటీన్లకై బీర్ల వినతి

✍ జయభేరి, హైదరాబాద్/ యాదగిరిగుట్ట :



ప్రతి నిత్యం శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దర్శనార్థం విచ్చేసిన భక్తుల సౌకర్యార్థం మహిళా శక్తి క్యాంటీన్లు యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రంలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వ విప్,ఆలేరు శాసన సభ్యులు బీర్ల అయిలయ్య విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని మహిళ క్యాంటీన్స్ ఏర్పాటు వల్ల మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని, మహిళా సాధికారత చేకూరుతుందని అన్నారు. సోమవారం అసెంబ్లీలో బీర్ల అయిలయ్య మాట్లాడుతూ తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్టలో భక్తులు ఎక్కువ వస్తుంటారు. అందువల్ల మహిళా క్యాంటీన్లను యాదగిరిగుట్టలో ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్,గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కను ఆయన కోరారు. దీని ద్వారా యాదగిరిగుట్ట పరిసర ప్రాంత మహిళలు ఆర్థిక అభివృద్ధి జరుగుతుంది. రాష్ట్ర ప్రభుత్వం తరపున మహిళా క్యాంటీన్లను ఏర్పాటు చేయాలని కోరారు. మన ప్రజా ప్రభుత్వం వచ్చాక మహిళకు పెద్దపీట వేయడం వల్ల సర్పంచ్ ఎన్నికల్లో 70 శాతం మెజార్టీ రావడం జరిగిందన్నారు. ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం, మహిళలకు పెట్రోల్ బంకులకు ఓనర్లను చేయడం,ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఇవ్వడం వల్ల మహిళలకు ఆత్మ గౌరవం పెరిగిందన్నారు. గత 10ఏళ్ల పాలనకు రెండు సంవత్సరాల ప్రజా పాలనలో మహిళలు కాంగ్రెస్ అంటే మా కుటుంబం అనే ఆలోచనతో మద్దత్తు ఇవ్వటం జరిగిందన్నారు. గత ప్రభుత్వం విస్మరించిన వడ్డీలేని ఋణలు,ఇప్పటికే మన ప్రభుత్వం మూడు దఫాలుగా ఇవ్వడం జరిగిందని దీని ద్వారా మహిళలు ఆర్థిక బలోపేతం అవుతారన్నారు. ప్రతి గ్రామాల్లో ఇందిరమ్మ ఇల్లు,చీరలు మహిళ సంఘాలకే వస్తాయనే ఆలోచనలో ఉన్నారని.. 18 సంవత్సరాలు నిండి, 90 సంవత్సరాల వృద్ధులు, మహిళలకు కూడా చీరలు ఇవ్వాలని కోరారు. గత ప్రభుత్వం 60 రూపాయల చీరలు పంచి మహిళల ఆత్మగౌరవం దెబ్బతీసారని, మన ప్రభుత్వం నేతన్నలతో నెచిన ఈ విలువైన చీరను అర్హులైన మహిళలందరికీ ఇవ్వాలని కోరారు.

తల్లిగారి ఇంటి నుండి మా అన్న రేవంతన్న పంపిస్తున్న చీర కట్టుకోవాలని మహిళలు సంతోషిస్తున్నట్లు ప్రభుత్వ విప్, ఆలేరు శాసన సభ్యులు బీర్ల అయిలయ్య తెలిపారు.

**ప్రతిపాదనలు పంపండి :**
**తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క**

మహిళ శక్తి క్యాంటిన్ అంటే అమ్మ చేతి వంట ఉంటుందని, తక్కువ ధరలో న్యాణమైన వంటకాలను ఆత్మీయతతో, ప్రేమతో అభిమానంతో అందిస్తారని తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. శ్రీ లక్ష్మ నరసింహస్వామి దర్శనార్థం యాదగిరిగుట్టకు విచ్చేసిన భక్తుల సౌకర్యార్థం యాదగిరిగుట్టలో మహిళా క్యాంటీన్ లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వ విప్, ఆలేరు శాసన సభ్యులు బీర్ల అయిలయ్య చేసిన విజ్ఞప్తికి తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్,గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క సానుకూలంగా స్పందించారు. యాదగిరిగుట్టలో మహిళా క్యాంటీన్ల ఏర్పాటుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆమె తెలిపారు. ఈ ప్రతిపాదనలను జిల్లా కలెక్టర్ అందించాలని తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్,గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క సూచించారు.

# మేరా లాగిన్-మేరా రూల్

✍ జయభేరి, మెడిపల్లి :



తెలంగాణ రాష్ట్ర డీజీపీ ఉత్తర్వుల మేరకు, సోమవారం ఉదయం 11:00 గంటలకు, మెడిపల్లి పోలీసులు అరోరా PG కాలేజీ, బోడుప్పల్ లో సుమారు 300 మంది కాలేజీ విద్యార్తులతో సైబర్ నేరాల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆరు వారాల కార్యక్రమంలో ఐదవ వారంలో 'మేరా లాగిన్మేరా రూల్ ' అనే థీమ్‌తో ఈ కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు ఆన్‌లైన్ మోసాలు, సైబర్ భద్రత, మోసాలు జరిగిన వెంటనే తీసుకోవలసిన చర్యలపై అవగాహన కల్పించబడింది.

**గుర్తింపు దొంగతనం :** ఇతరుల వ్యక్తిగత సమాచారం (ఆధార్ నంబర్, పాన్ కార్డు, బ్యాంక్ వివరాలు, పాస్‌వర్డులు మొదలైనవి) దొంగిలించి దుర్వినియోగం చేయడాన్నిగుర్తింపు దొంగతనం అంటారు. దీనివల్ల ఆర్థిక నష్టం లేదా నకిలీ ఖాతాలు తెరవడం జరుగుతుంది.

**సోషల్ మీడియా నకిలీ ఖాతాలు :** మోసగాళ్లు నిజమైన వ్యక్తి, సంస్థ లేదా ప్రముఖుడిలా నటిస్తూ నకిలీ సోషల్ మీడియా ఖాతాలు సృష్టిస్తారు. వాటి ద్వారా డబ్బు, వ్యక్తిగత సమాచారం లేదా OTPలు అడిగి ప్రజలను మోసం చేస్తారు.

**OTP మోసాలు :** ఫోన్ కాల్స్, మెసేజ్‌లు లేదా నకిలీ లింక్‌ల ద్వారా OTPని చెప్పించుకుని మోసం చేయడాన్ని OTP మోసం అంటారు. OTP దొరికిన తర్వాత బ్యాంక్ ఖాతాలు లేదా ఆన్‌లైన్ సేవలను అక్రమంగా ఉపయోగిస్తారు.

**KYC అప్‌డేషన్ మోసాలు :** మీ బ్యాంక్ ఖాతా లేదా సిమ్ బ్లాక్ అవుతుందని చెప్పి తక్షణమే KYC అప్‌డేట్ చేయమని మోసగాళ్లు భయపెడతారు. నకిలీ లింక్‌లు పంపి లేదా వివరాలు అడిగి డబ్బు లేదా డేటాను దొంగిలిస్తారు.


**నకిలీ కస్టమర్ కేర్ మోసాలు :** బ్యాంకులు, టెలికాం లేదా ఆన్‌లైన్ సంస్థల కస్టమర్ కేర్‌గా నటిస్తూ మోసగాళ్లు కాల్ చేస్తారు లేదా నకిలీ హెల్ప్‌లైన్ నంబర్లు ఇస్తారు. కార్డు వివరాలు, OTPలు లేదా రిమోట్ యాక్సెస్ తీసుకుని మోసం చేస్తారు.

ఈ కార్యక్రమంలో సైబర్ క్రైమ్ DCP నాగలక్ష్మి, ACP శివ శంకర్, ఇన్స్పెక్టర్ మాధవి, మేడిపల్లి పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ గోవింద్ రెడ్డి, మేడిపల్లి గోవేర్నమేంట్ స్కూల్ హెడ్ మాస్టర్, ఫారెస్ట్ డిపార్టుమెంటు, ఉప్పల్, చెంగిచెర్ల బస్సు డిపో ఎంప్లాయిస్, చెంగిచెర్ల, నారాపల్లి మెడికల్ డాక్టర్స్, బోడుప్పల్ SBI బ్యాంకు మేనేజర్, GHMCబోడుప్పల్ ఎంప్లాయ్, మేడిపల్లి రెవిన్యూ సిబ్బంది, అగ్రికల్చర్ ఎంప్లాయిస్, బోడుప్పల్ ఆటో, లారీ యూనియన్ ఎంప్లాయిస్ పాల్గొన్నారు. చివరగా, మెడిపల్లి పోలీసులు ఆధ్వర్యంలో బోడుప్పల్ లోని అరోరా PG కాలేజీ, బోడుప్పల్ విద్యార్థులకు ఆన్‌లైన్‌లో జాగ్రత్తగా ఉండాలని, అనుమానాస్పదమైన సైబర్ కార్యకలాపాలను వెంటనే రిపోర్ట్ చేయాలని, తమ కుటుంబ సభ్యులు-స్నేహితులకు కూడా ఇదే అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు.

# రైతులకు, మత్స్యకారుల ఉపాధికీ గండి కొట్టిన కాంగ్రెస్ నాయకులు

- చెక్ డ్యామ్ లను కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకోవాలి
- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి

✍ జయభేరి, భూపాలపల్లి :



గతంలో చెక్ డ్యామ్ కూల్చిన ప్రదేశాన్ని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి సందర్శించారు. చిట్యాల మండలం నవాబ్ పేట, మొగుళ్ళపల్లి మండలం పోతుగల్లు గ్రామాల మధ్యలో రైతుల సంక్షేమం కోసం బిఆర్ఎస్ ప్రభుత్వంలో తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ని ఒప్పించి చలివాగుపై నిర్మించిన చెక్ డ్యామ్‌ను కొంతమంది కాంగ్రెస్ నాయకులు బాంబులతో పేల్చి ధ్వంసం చేయడంతో ప్రస్తుతం విలువైన నీరు వృథాగా వెళ్లిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ చెక్ డ్యామ్ ద్వారా గతంలో రెండు పంటలు సునాయాసంగా పండేవని, మత్స్యకారులకు ఉపాధి లభించేదని గుర్తు చేశారు. అయితే నేడు నీరు ఇవ్వలేని కాంగ్రెస్ ప్రభుత్వం, కొందరు నాయకులు రాజకీయ దురుద్దేశంతో ఈ చెక్ డ్యామ్‌ను ధ్వంసం చేయడం దుర్మార్గమైన చర్య అని విమర్శించారు.

ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే దేవాదుల పంపులను ఆన్ చేసి రైతులకు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే చెక్ డ్యామ్ కూల్చిన వారిపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వెనుక ఎమ్మెల్యే ప్రొద్భలంతో ఉందని ఆరోపించారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని, చెక్ డ్యామ్‌ను పునరుద్ధరించి రైతులకు న్యాయం చేయాలని గండ్ర వెంకట రమణా రెడ్డి డిమాండ్ చేశారు.

# శతజయంతి ఉత్సవాల బహిరంగ సభను జయప్రదం చేయాలి

✍ జయభేరి, తుర్కపల్లి, జనవరి 05 :




ఈనెల 18న ఖమ్మంలో జరిగే సిపిఐ శతజయంతి ఉత్సవాల బహిరంగ సభను విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కళ్లెం కృష్ణ అన్నారు. సోమవారం తుర్కపల్లి మండల కేంద్రంలో మండల కౌన్సిల్ సమావేశాన్ని నాగపూర్ నరసింహ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ శతజయంతి ఉత్సవాల సందర్భంగా ఈ నెల 18న ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభకు అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. తెలంగాణలో నిజాం రాచరిక వ్యవస్థ అంతం కావాలని తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నిర్వహించి తెలంగాణకు విముక్తి కలిగించి 4500 మంది కమ్యూనిస్టుల రక్త తర్పణంతో పది లక్షల ఎకరాల భూమిని పేద ప్రజలకు పంచిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీలను అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కలకుంట్ల సత్యనారాయణ, వల్లపు భగవంతు, కాశ బోయిన పెద్దలు, దాసరి బాలయ్య, కసర బోయిన పోచయ్య, కసిర బోయిన బక్కయ్య, ఆకుల బాలకృష్ణ పాల్గొన్నారు.




## వెనిజులాపై అమెరికా బీకర దాడులను ఖండిస్తున్నాం

✍ జయభేరి, తుర్కపల్లి, జనవరి 05 :

వెనిజులా పై అమెరికా బీకర దాడులను ఖండిస్తున్నట్లు, వెనిజులా దేశ అధ్యక్షుడు మధురో దంపతులను బే షరతుగా విడుదల చేయాలని సిపిఎం మండల కార్యదర్శి పోతరాజు జహంగీర్ అన్నారు. సోమవారం తుర్కపల్లి మండల కేంద్రంలో సిపిఎం ఆధ్వర్యంలో ప్లే కార్డ్స్ ప్రదర్శించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనిజులా దేశంలో చమురుబావులను కొల్లగొట్టేందుకు ఆ దేశ రాజధాని కరాకస్ పై శిభినీల రాకెట్లతో బీకర దాడి చేసి ఏడు చోట్ల బాంబులు పేలులతో విధ్వంసం సృష్టించారని సైనిక సావరాలు జనావాసాలను నేలమట్టం చేయడంతో సామాన్య పౌరులు మరణించడంతోపాటు పెద్ద సంఖ్యలో గాయాలయ్యాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు తలారి మాతయ్య, గడ్డమీది నరసింహ, తుటి వెంకటేశం, సిలువేరు పెంటయ్య, బరిగా రాములు, గోలియా నాయక్, మహేష్ పాల్గొన్నారు.

## గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాను



✍ జయభేరి, తుర్కపల్లి, జనవరి 05 :

గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సర్పంచ్ పుట్ట సాయిలు అన్నారు. సోమవారం తుర్కపల్లి మండలం గోపాలపురం గ్రామంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో మొదటి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఉన్న సమస్యలను తెలుసుకొని సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొండబోయిన శ్రీశైలం, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఫామ్ ఆయిల్ తోటలకు రైతులకు ప్రభుత్వ సబ్సిడీ



✍ జయభేరి, తుర్కపల్లి, జనవరి 05 :

ఫామ్ ఆయిల్ తోటలకు ప్రభుత్వం రైతులకు సబ్సిడీ అందజేస్తున్నట్లు ఆర్టికల్చర్ అధికారి మౌనిక తెలిపారు. సోమవారం తుర్కపల్లి మండలం తిరుమలపురం గ్రామంలో సర్పంచ్ దొనికెన రేణుక వెంకటేష్ యాదవ్ ఆధ్వర్యంలో కొత్తగా తోటలు వేసుకునే రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొత్తగా తోట వేసుకునే రైతులకు ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహకాలను, సబ్సిడీలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నూకల శ్రీనివాస్ యాదవ్, పంచాయతీ కార్యదర్శి జ్యోతి, వార్డు సభ్యులు స్వప్న సంపత్ యాదవ్, నాంసాని నరేష్ యాదవ్, వంగ కరుణాకర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు వంగ నారాయణ రెడ్డి, కలకొండ నవీన్, పోలమైన చంద్రపాల్, రైతులు బోయిని కనకయ్య, వెంకటేష్, తుటి కిష్టయ్య, బూసి మల్లయ్య, బాల నరసయ్య పాల్గొన్నారు.



## మేడిపల్లిలో ఉప్పల్ కోర్టు కాంప్లెక్స్ లో లావాదేవీలు ప్రారంభం

✍ జయభేరి, మేడిపల్లి :

మల్కాజిగిరి జిల్లా మేడిపల్లిలో ఏర్పాటు చేసిన ఉప్పల్ కోర్టు కాంప్లెక్స్ లో నేటి నుండి కేసుల కార్యకలాపాలు మొదలైనాయి. ఉప్పల్ కోర్టు కాంప్లెక్స్ ఏర్పాటు చేయడం వలన పలువురు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మేడిపల్లిలోని ఉప్పల్ కోర్ట్ కాంప్లెక్స్ ఏర్పాటు కావడం సంతోషం. ప్రస్తుతానికి పూర్తి వస్తువులు లేకున్నా మునుముందు పూర్తి స్థాయిలో వసతులు ఏర్పాటు చేయడానికి న్యాయవాదులుగా మేము కృషి చేస్తామని అన్నారు. ఉప్పల్, నాచారం మేడిపల్లి, ఘట్కేసర్, పోచారం పోలీస్ స్టేషన్లకు సంబంధించిన కేసులు ఈ కోర్టులో నడుస్తాయి. క్లైంట్లకు, లిటిగెన్స్ కి న్యాయవాదులకు ఇక్కడి కోర్టు కాంప్లెక్స్ గురించి తెలియాలి. న్యాయ సమస్యల పరిష్కారం కోసం ఈ ప్రాంత పౌరులు ఉప్పల్ కాంప్లెక్స్ లో సేవలు ఉపయోగించుకోవాలని న్యాయవాదులు పేర్కొన్నారు.

## ఉత్తమ సేవలకు గుర్తింపు



✍ జయభేరి, మేడిపల్లి :

మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ పొన్నం అరుణ్ కుమార్ మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో సైబర్ వారియర్‌గా తన విధులను నిబద్ధతతో నిర్వర్తిస్తున్నారు. సైబర్ నేరాల నియంత్రణలో భాగంగా, మేడిపల్లి పోలీస్ స్టేషన్ సైబర్ క్రైమ్ విభాగానికి సంబంధించిన సైబర్ పిటిషన్లను వేగంగా, సమర్థవంతంగా, అత్యధిక సంఖ్యలో డిస్పోజల్ చేయడంలో ఆయన విశేష కృషి చేశారు. ఈ ఉత్తమ సేవలకు గుర్తింపుగా, సోమవారం తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డిజిపీ) కానిస్టేబుల్ పొన్నం అరుణ్ కుమార్ కి చేతుల మీదుగా అప్రిసియేషన్ సర్టిఫికెట్‌ను ప్రదానం చేయడం జరిగింది.

## డ్రైనేజి లైను పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే



✍ జయభేరి, మల్లాపూర్ :

ఓల్డ్ మల్లాపూర్ లోని బీసీ ఏరియాలో, మైనారిటీ బస్తీలో 22 లక్షల రూపాయలతో డ్రైనేజి లైను పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఓల్డ్ మల్లాపూర్ లోని పలు బస్తీల్లో నెలకొన్న సమస్యలను పరిశీలించారు, వాటిని దశల వారిగా పరిష్కరిస్తానని ఓల్డ్ మల్లాపూర్ వాసులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ సిరాజుద్దీన్, స్థానిక నాయకులు, బస్తి వాసులు, ఎస్వీ శివకుమార్, తిగుళ్ల శ్రీనివాస్ గౌడ్, కటర్ల భాస్కర్, తండా వాసుగౌడ్, నెలట్ల శ్రీనివాస్ గౌడ్, ఉస్మాన్, అల్లాడి కృష్ణ యాదవ్, ఉమ రాణి, పావని, గణేష్, గడ్డం కృష్ణ, రాపోలు శ్రీనివాస్, రాజేష్ గౌడ్, నరహరి గౌడ్, శ్రీశైలం, రఘు, అశు, సాబేర్ అలీ, లక్ష్మణ్, అంజద్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## శాంతినగర్ గడ్డపై దళితుల రాజ్యాధికారానికి ఐక్య పోరాటం అవసరం

- నరాల అశోక్ కుమార్ ఆధ్వర్యంలో సభ సమావేశం
- డాక్టర్ బీ ఆర్ అంబెడ్కర్ మనవడు యశ్వంత్ అంబేద్కర్ పిలుపు



✍ జయభేరి, హైదరాబాద్, జనవరి 6 :

బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మనుమడు, బుద్ధిష్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా, ఆర్‌పీఐ జాతీయ అధ్యక్షుడు యశ్వంత్ అంబేద్కర్ దళితులు తమ రాజ్యాధికార సాధన కోసం ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఆదివారం తార్నాక డివిజన్ శాంతినగర్ చౌరస్తాలో ఆర్‌పీఐ తెలంగాణఆంధ్రప్రదేశ్ ఇంచార్జ్ మేజర్ చంద్రకాంత్‌తో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా శాంతినగర్ చౌరస్తాలో ఉన్న అంబేద్కర్, జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం శాంతినగర్, ఆర్యనగర్, వినుబనగర్ ప్రాంతాలకు చెందిన దళితబహుజన నాయకులు, స్థానికులతో సమావేశమై బహుజనుల ప్రస్తుత స్థితిగతులు, ఎదుర్కొంటున్న సమస్యలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా యశ్వంత్ అంబేద్కర్ మాట్లాడుతూ.. "రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాల్లో దళితుల హక్కుల సాధనకు సమిష్టి పోరాటమే మార్గం" అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ క్రిస్టియన్స్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్, స్వేరోస్ నగర కార్యదర్శి కుమార్ షాను, నరాల అశోక్ కుమార్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించబడింది. అలాగే సీబీఎన్ నగర్ యూత్ అసోసియేషన్ నాయకులు నరాల మల్లేష్, వేణు, కరుణాకర్, దయాకర్, విఘ్నేష్, సుభాష్, కుమార్, ప్రకాష్, శంకర్ ప్రసాద్, పరమేష్, బన్నీ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# అక్రమ గోదాం పై చర్యలు తీసుకోవాలి

- మల్లెల వెంకటేష్
- ప్రజావాణిలో డిప్యూటీ కమిషనర్ కు ఫిర్యాదు



**జయభేరి, మేడ్చల్ :**

పూడూరు కిష్టాపూర్ డివిజన్ పరిధిలోని గోసాయి గూడలోని సర్వేనెంబర్ 20లో అక్రమంగా నిర్మించిన గోదాం పై చర్యలు తీసుకోవాలని పూడూరు గ్రామానికి చెందిన మల్లెల వెంకటేష్ మున్సిపాలిటీ అధికారులను కోరారు.ఈ మేరకు సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో డిప్యూటీ కమిషనర్ సుదాన్షు కు గ్రామస్తులతో కలసి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాలు ఇలా ఉన్నాయి. గోసాయిగూడ గ్రామంలోని సర్వేనెంబర్ 20లో అక్రమ గోదాం నిర్మాణం చేపట్టడం జరిగిందని తెలిపారు. ఎలాంటి వ్యాపార లైసెన్స్ లేకుండా ముడి రసాయనాలను డంపు చేసి వాటిని రసాయన డ్రమ్ములలో మార్చే వ్యాపారం చేస్తున్నాడని తెలిపాడు. ఎలాంటి లైసెన్స్ లేకుండా ఈ వ్యాపారం చేయడం వల్ల ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలిగే అవకాశం ఉందని తెలిపారు.ల్యాండ్ కన్వర్షన్ లేకుండా వ్యవసాయ భూమిలో గోదామును నిర్మించి అందులో రసాయనాలను డంపు చేయడం వల్ల తీవ్రమైన దుర్వాసన వస్తుందని పేర్కొన్నారు.దీనివల్ల చుట్టుపక్కల ఉన్న గాలి కలుషితం అవుతుందని ఆరోపించారు.అనుకోకుండా పేలుడు సంభవిస్తే దానిని ఆపడానికి తగిన చర్యలు తీసుకోలేదని,చెత్త విరుద్ధ నిర్మాణంతో పాటు పర్యావరణ నిబంధనల ఉల్లంఘన పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ గోదాంకు వెళ్లడానికి రహదారి లేదని,మండల సర్వేయర్ నుండి చట్ట విరుద్ధంగా స్థల స్కెచ్ ను పొందారని ఆరోపణలు చేశారు.మండల సర్వేర్ ఇచ్చిన స్కెచ్ లో 15 ఫీట్ల స్థలం మ్యాపులో ఉందన్నారు.ఏదైనా వాణిజ్య గోదాము నిర్మాణానికి 40 ఫీట్ల వెడల్పు గల రహదారి ఉండాలని నిబంధన ఉందని, చట్ట విరుద్ధ నిర్మాణం చేసిన గోదాంకు రహదారి లేదని,ఈ విషయంపై గతంలో మున్సిపల్ అధికారులకు,జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన ఫలితం లేకుండ పోయిందని వాపోయారు.ఈ విషయంలో హైకోర్టును తమ ఆశ్రయించడం జరిగిందని దీంతో హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చిందని గుర్తు చేశారు.ఈ విషయంలో సమగ్ర విచారణ జరిపించాలని మల్లెల వెంకటేష్ డిప్యూటీ కమిషనర్ ను కోరారు.ఫిర్యాదు చేసిన వారిలో వి. రంగయ్య,వి.శ్రీధర్,గ్రామస్తులు జీ.సత్యనారాయణ రెడ్డి,మల్లెల శ్రీశైలం,నిమ్మల కృష్ణ యాదవ్,యాటవెల్లి రాజశేఖర్ రెడ్డి,జీ.అనంత్ రెడ్డి,కుమార్ యాదవ్,నాగేశ్వర్ రావు,మల్లెల రమేష్ లు ఉన్నారు.



## సన్న బియ్యం అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

**జయభేరి, కుత్బుల్లాపూర్ :**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 294 డివిజన్ బహదురుపల్లి పరిధిలోని పోచంపల్లి డబుల్ రూమ్ ప్రాంతంలో శ్రీహరి ఏర్పాటు చేసిన తెలంగాణ రాష్ట్ర జాతీయ పౌర సరఫరాల పతాక దుకాణాన్ని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేద ప్రజలకు నాణ్యమైన సన్న బియ్యం అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి అర్హ కుటుంబానికి ఆహార భద్రత కార్డు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ప్రజా సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పని చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా గ్రంథాలయ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, మాజీ జెడ్ పి వైస్ చైర్మన్ బొంగునూరి ప్రభాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ రాము గౌడ్, మైసిగారి శ్రీనివాస్, కావలి గణేష్, యువజన సీనియర్ నాయకులు బొంగునూరి కిశోర్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు జక్కుల మల్లేష్ యాదవ్, ముత్యం రెడ్డి, అకుల ప్రేమ్ కుమార్, సదానందం, డబల్ బెడ్ రూమ్ వాసులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి హామీ




**జయభేరి, ఎల్బీనగర్ :**

వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి హైదరాబాద్ మెట్రో పాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు ఓ & ఎం డివిజన్ - XI జనరల్ మేనేజర్ మహేందర్ ని కలుసుకున్నారు. ఈ సమావేశంలో వనస్థలిపురం డివిజన్ పరిధిలోని పలు కాలనీలకు చెందిన ప్రజాప్రతినిధులు, కాలనీ అధ్యక్షులు పాల్గొని తమ తమ కాలనీల్లో ఉన్న తాగునీరు, డ్రైనేజీ, సీవరేజ్ కు సంబంధించిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. కార్పొరేటర్ కాలనీ వారీగా ఎదురవుతున్న నీటి కొరత, డ్రైనేజీ ఓవర్‌ఫ్లో, సీవరేజ్ లైన్ల సమస్యలు తదితర అంశాలను సమగ్రంగా వివరించారు. దీనిపై జనరల్ మేనేజర్ సానుకూలంగా స్పందిస్తూ, సంబంధిత అధికారులతో సమన్వయం చేసి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు త్వరితగతిన చేపడతామని హామీ ఇచ్చారు. ప్రజల సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్న వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి ప్రయత్నాలు అభినందనీయం. ఈ కార్యక్రమంలో క్రిస్టియన్ కాలనీ అధ్యక్షులు హరిధర్ రెడ్డి, హస్తినాపూర్ ఈస్ట్ అధ్యక్షులు కుంచారపు భూపతి రెడ్డి, ఆర్టీసీ కాలనీ అధ్యక్షులు రౌత్ ముకుంద్ రాజ్, శక్తి నగర్ అధ్యక్షులు అజయ్, అభ్యుదయ నగర్ కాలనీ అధ్యక్షులు గంగి రెడ్డి, ఈస్ట్ కాలనీ అధ్యక్షులు తల్లా సతీష్ గౌడ్, సబ్ డివిజన్ - II డిప్యూటీ జనరల్ మేనేజర్ రాజ్ గోపాల్ల, ఎన్‌జీఓ కాలనీ సెక్షన్ మేనేజర్ పి. భావ్య, వనస్థలీపురం సెక్షన్ మేనేజర్ సాయి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## నకిలీ ఓటర్లను తొలగించాలని కలెక్టర్‌ను కోరిన మాజీ ఎమ్మెల్యే గండ్ర



**జయభేరి, భూపాలపల్లి :**

భూపాలపల్లి జిల్లాలోని భూపాలపల్లి మున్సిపాలిటీలో ఇటీవల విడుదల చేసిన ఓటర్ లిస్ట్ జాబితాలో ఉన్న నకిలీ ఓటర్లను వెంటనే తొలగించాలని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి గ్రీవెన్స్ సెల్ లో జిల్లా కలెక్టర్ ని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజాస్వామ్య వ్యవస్థలో స్వచ్ఛమైన ఎన్నికలు జరగాలంటే ఓటర్ల జాబితా పారదర్శకంగా, తప్పులు లేకుండా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. నకిలీ ఓట్ల వల్ల ప్రజల నిజమైన హక్కులు దెబ్బతింటాయని, అందుకే సమగ్ర విచారణ చేసి అర్హతలేని ఓటర్లను తొలగించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా అర్హులైన ఒక్క ఓటరు కూడా ఓటు హక్కు కోల్పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎన్నికల అధికారులు చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

## ఎంపీ ఈటల రాజేందర్ ను కలిసిన గిరిజనమోర్చా నాయకులు



**జయభేరి, మేడ్చల్ :**

గిరిజన తండాలోని ప్రభుత్వ పాఠశాలలో సరైన వసతులు లేక పేద విద్యార్థులు చదువుకు దూరమైతున్నారని వారికి ప్రభుత్వం నుండి వసతులు కల్పించాలని కోరుతూ గిరిజన మోర్చా తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ భట్టు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాజాబొల్లారం తండా నాయకులు ఎంపి ఈటల కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు నమ్మి తిరుపతి, రాజబొల్లారం తండ ప్రజాప్రతినిధులు భూక్య గోపి నాయక్, రమావత్ చందర్, నాయక్ మాలోత్ సురేష్, నాయక్ మెగావత్ వేణు, నాయక్ మలావత్ నరేందర్, నాయక్ దలావత్ రోహన్ రాజ్, నాయక్ దలావత్ రోహిత్ రాజ్, రమావత్ సక్రాం నాయక్, భూక్య సంతోష్, భూక్య మనోహర్, భూక్య అశోక్ తదితరులు పాల్గొన్నారు.




## పిఆర్ టియు క్యాలెండర్ ఆవిష్కరణ

**జయభేరి, చందంపేట :**

చందంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చందంపేట పిఆర్టియు అధ్యక్షులు ఎం చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పిఆర్ టియు అతిపెద్ద ఉపాధ్యాయ సంఘం అని ఉపాధ్యాయుల సమస్యలను తీర్చుటకు ఎప్పుడు కూడా ముందంజలో ఉంటుందని ఈ సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి పాపయ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు గోవింద కొండయ్య పంతులాల్ మల్లేష్‌నాయక్ జిహెచ్ఎంపీ లీలారాణి ఉపాధ్యక్షులు రామచంద్రు రాష్ట్ర ఉపాధ్యక్షులు జోసెఫ్ చౌదరి సభ్యులు విజయ నినారాణి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ఇతర సంఘ సభ్యులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినారు.

## పెన్షనర్స్ సేవాసదంలో పుట్టినరోజు వేడుకలు




**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ పెన్షనర్స్ సేవాసదనంలో ఉపాధ్యక్షులు ఆకులపల్లి ఐజాక్ 76వ పుట్టినరోజు సందర్భంగా కార్యదర్శి, సహా అధ్యక్షులు, కార్యనిర్వాహక కార్యదర్శి అంకం చంద్రమౌళి, గంగిడి దామోదర్ రెడ్డి, మహమ్మద్ యూసుఫ్ షరీఫ్ షాలువ కప్పి, కిరీటం అలంకరించి, స్వీట్ తినిపించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసినారు. మోటమర్రి పురుషోత్తం పుట్టినరోజు పాటపాడి ఆనందపరచినారు. ఐజాక్ మాట్లాడుతూ మా పెన్షనర్స్ సంఘం సభ్యుల ఆనందం కొరకు వినూతన కార్యక్రమాలు చేపట్టి మమ్మల్ని ఆనందపరచడంలో మొదట వున్నారు. పాలుగొన్న మిత్రులందరికీ కృతజ్ఞతలు తెలియజేసినారు. అందరికి స్వీట్ తేనీరు అందజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కంచర్ల నారాయణ రెడ్డి, సంయుక్త కార్యదర్శి వనం బుచ్చయ్య, కార్యవర్గం సభ్యులు సల్వాది పెద్దులు, మౌలానా, మునిని వీరయ్య, మహమ్మద్ అలీ, తాడూరు సత్యనారాయణ, లక్ష్మయ్య, మరియమ్మ, లక్ష్మి తదితరులు పాలుగోని శుభాకాంక్షలు తెలియజేసినారు.

## రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ మున్సిపల్ రెండవ సాధారణ ఎన్నికల సందర్భంగా దేవరకొండ పురపాలక సంఘం నందు రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వై. సుదర్శన్ రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతూ సలహాలు సూచనలు స్వీకరించబడునని తెలిపారు. ఈ నెల 9వ తారీకు వరకు ఓటర్ల జాబితా పిర్యాదులను స్వీకరించి 10 వ తేదీన తుది ఓటర్ల జాబితా విడుదల చేయనున్నట్లు కమిషనర్ తెలియజేసినారు.

## అక్రమ డాక్యుమెంట్ రద్దు చేసిన సబ్ రిజిస్ట్రార్




**జయభేరి, యాదగిరిగుట్ట :**

యాదగిరిగుట్ట పట్టణంలోని గుండ్లపల్లి పరిధిలోని సర్వే నంబర్ 24/1, ఫ్లాట్ నంబర్ 3/బీలో గల 250 గజాల భూమికి జరిగిన అక్రమ రిజిస్ట్రేషన్ ను రద్దు చేస్తున్నట్లు సబ్ రిజి స్ట్రార్ దోసపాటి శ్రీవాణి సోమవారం ప్రకటించారు. కొప్పు స్వామి నాదన్ చెందిన భూమిని కొందరు వ్యక్తులు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారని గుర్తించిన రిజిస్ట్రేషన్ అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేసి నిర్ధారించారు. యాదగిరిగుట్ట పట్టణంలోని మయూరి హోటల్ పక్కనే సర్వే నంబర్ 24/1 లో గల ఫ్లాట్ నంబర్ 3/బీలో గల 250 గజాల భూమిని కొప్పు స్వామి నాదన్ 1984 సంవత్సరంలో కొనుగోలు చేశారన్నారు. ఈ క్రమంలో కొప్పు స్వామి నాధన్ మృతి చెందారు. నాటి నుంచి ఆయన వారసులు భూమివద్దకు రాలేదు. ఇదే అదునుగా భావించిన యాదగిరిగుట్ట పట్టణంలోని కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ కౌన్సిలర్ భర్త కబ్జాకు చేసేందుకు ప్రయత్నించాడు. దీంతో వల్లందాస్(కొప్పు) స్వామి అనే వ్యక్తిని తెరపైకి తీసుకువచ్చాడు. సబ్ రిజిస్ట్రార్ తో కుమ్మక్కై పాత సీసీ కాపీలు, డాక్యుమెంట్లను మాయం చేసి నిబంధనలకు విరుద్ధంగా గతేడాది అక్టోబర్ 3వ తేదీన అక్రమంగా బబ్బూరి పోశెట్టి అనే వ్యక్తి పేరిట 250 గజాల ప్లాటును రిజిస్ట్రేషన్ చేశాడు. స్థలంలో మూడ తంస్తుల భవనాన్ని సైతం నిర్మించారు. దీనిపై స్పందించిన బీజేపీ పార్టీ పట్టణ అధ్యక్షుడు కర్రె ప్రవీణ్ సరైన పత్రాలతో మీడియా సమావేశం ఏర్పాటు చేసి కాంగ్రెస్ పార్టీ నాయకులు చేస్తున్న ఆగడాలను ఎండగట్టారు. అధికారులు స్పందించకపోతే పోరాటానికి సిద్ధమని హెచ్చరించారు. దీంతో తప్పు తెలుసుకున్న సబ్ రిజిస్ట్రార్ బబ్బూరి పోశెట్టిపై చేసిన డాక్యుమెంట్ ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. కాగా కబ్జాకు పాల్పడిన వ్యక్తులపై చర్యలు తీసుకుని, తమ భూమిని తమకు ఇప్పించాలని బాధితుడు కొప్పు ఘనశ్యామ్ సోమవారం యాదగిరిగుట్ట పోలీస్టేషన్ ఫిర్యాదు చేశారు. వెంటనే విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

# అక్రమ నిర్మాణాలను అడ్డుకునేదెవరు..?



- మేడ్చల్ సర్కిల్ లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండికొడుతున్న వైనం

**జయభేరి, మేడ్చల్ :**

అడ్డగోలు నిర్మాణాలకు మేడ్చల్ సర్కిల్ అడ్డాగా మారింది. ఇక్కడ భవనం నిర్మాణం చేయాలంటే టౌన్ ప్లానింగ్ అధికారుల ఆశీస్సులు ఉంటే చాలు నిబంధనలతో పనిలేదన్న విషయం బహిరంగ రహస్యమైపోయింది. భావన నిర్మాణ దారులు జిహెచ్ఎంసి సర్కిల్ కార్యాలయంలో కొందరిని ప్రసన్నం చేసుకుంటే చాలు నిర్మాణాలకు సెట్ బ్యాకులు వదలకున్నా, అంతస్తులు పెంచేసినా అంత మాములే అన్నట్లుగా మారిపోయింది. దీంతో చాలా మంది నిర్మాణదారులు రెండు అంతస్తుల భవనానికి అనుమతులు తీసుకొని నిబంధనలకు విరుద్ధంగా మూడు అంతస్తుల భవనాలను నిర్మిస్తున్నారు. మేడ్చల్ డివిజన్ జాతీయ రహదారి సమీపంలో కొందరు బిల్డర్ల అవతరమెత్తి అంత తామే అన్నచందంగా వ్యవహరిస్తున్నారు. సర్కిల్ కార్యాలయంలో కొందరి ఉద్యోగులను మచ్చిక చేసుకొని ఇష్టానుసారంగా అనుమతులకు మించి అంతస్తుల నిర్మాణాలు చేస్తున్నారు. దింతో ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి పడుతుందని పలువురు ఆరోపిస్తున్నారు. అక్రమ నిర్మాణాలను నిరంతరం పర్యవేక్షించే అధికారులు ఇప్పటికైనా వాటిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

**ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి..**

మేడ్చల్ సర్కిల్ అధికారులు, సిబ్బంది తమ జేబులు నిండితే చాలు అన్న విధంగా ప్రవర్తిస్తున్నారు. అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపాల్సిన వారు వాటిని ప్రోత్సహిస్తుండడంతో రోజుకో కొత్త నిర్మాణం ప్రారంభమౌతుంది అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. అక్రమార్కులు పదుల సంఖ్యలో అక్రమ నిర్మాణాలు చేపడుతుండడంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతుంది. ఆదాయాన్ని పెంచాల్సిన వారే గండికోడుతుండడం మరోవైపు సామాన్య ప్రజలపై మాత్రం పన్నుల భారం మోపుతున్నారని వారిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## అధికారుల చర్యలు ఎక్కడ..?

మేడ్చల్ సర్కిల్ పరిదిలోని కిష్టాపూర్‌పుడూర్, మేడ్చల్ డివిజన్ లలో అక్రమ కట్టడాలు యథేచ్చగా సాగుతున్నాయి. సరైన అనుమతులు లేకుండా పరిమితికి మించి అంతస్తుల్లో భవన నిర్మాణాలు చేపడుతున్నారు. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు కొందరికి నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకోవడంలో అలసత్వం వహిస్తుండటంతో అధికారుల తీరుతో ప్రజలలో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇళ్లు, అపార్టుమెంట్‌లు, ఇతరత్రా నిర్మాణాలు, పాత ఇళ్లపై అదనపు అంతస్థుల నిర్మాణానికి, దుకాణ సముదాయాలకు టౌన్ ప్లానింగ్ విభాగం నుంచి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి. ఆయా కేటగిరీలకు నిర్ణీత మొత్తంలో ఫీజులను చలానా రూపంలో చెల్లించాలి. అంతస్థులను బట్టి భవనం చుట్టూ (సెట్‌బ్యాక్) కొంత స్థలం వదిలిన తరువాతే నిర్మాణాలు చేపట్టాలి. కానీ టౌన్ ప్లానింగ్ విభాగంలో అధికారులను ప్రసన్నం చేసుకొని నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి సేన్ బ్యాక్స్ లేకుండా భవనాలు నిర్మిస్తున్నారు. అధికారుల తీరుపై జిల్లా, హెచ్.ఎం.డి.ఎ అధికారులు స్పందించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

# కేటీఆర్ నియోజకవర్గం..
# మార్పు కోరుకుంటున్నారా..?



జయభేరి, హైదరాబాద్, జనవరి 5 :

తెలంగాణ రాష్ట్రంలో భారత రాష్ట్ర సమితి రెండుసార్లు అధికారంలోకి వచ్చింది. ముఖ్యమంత్రిగా రెండు పర్యాయాలు తెలంగాణ రాష్ట్రాన్ని కెసిఆర్ పరిపాలించారు. రెండు పర్యాయాలు కూడా నాటి ముఖ్యమంత్రి కుమారుడు కేటీఆర్ కీలక శాఖలను పర్యవేక్షించారు. కేటీఆర్ సిరిసిల్ల నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఉద్యమం జరిగిన నాటి నుంచి ఇప్పటివరకు సిరిసిల్ల ఎమ్మెల్యేగా ఆయన కొనసాగుతున్నారు.సిరిసిల్ల ప్రాంతంలో కేటీఆర్ కు బలమైన క్యాడర్ ఉంది. ఇక్కడ చేనేత కార్మికులకు ఆయన అనేక విధాలుగా ప్రభుత్వ పథకాలు అందే విధంగా కృషి చేశారు. ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో భారత రాష్ట్ర సమితి అధికారంలో లేదు. భారత రాష్ట్ర సమితి అధ్యక్షుడిగా కేటీఆర్ కొనసాగుతున్నప్పటికీ.. ఫార్ములా ఈ కార్ రేసు లో ఆయన తీవ్రస్థాయిలో అభియోగాలు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే ఆయనను ఏసీబీ విచారించింది.2023 నుంచి ఇప్పటివరకు తెలంగాణ రాష్ట్రంలో భారత రాష్ట్ర సమితి అనుకూల ఫలితాలను సాధించలేకపోయింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైంది. పార్లమెంటు ఎన్నికల్లో 0 ఫలితాలను సాధించింది. స్థానిక ఎన్నికల్లో చెప్పుకోదగ్గ స్థానాలను కూడా సాధించలేకపోయింది. కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాలకు జరిగిన ఉప ఎన్నికల్లో గులాబీ పార్టీ ఓడిపోయింది. ఇన్ని ఓటముల సమయంలో భారత రాష్ట్ర సమితికి కార్య నిర్వాహక అధ్యక్షుడిగా కేటీఆర్ కొనసాగారు. కేటీఆర్ భారత రాష్ట్ర సమితి కార్య నిర్వాహక అధ్యక్షుడి హోదాలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అనేక పర్యాయాలు పర్యటించారు. గతంలో సిరిసిల్ల మీద కేటీఆర్ అంత సీరియస్ గా దృష్టి పెట్టేవారు కాదు. అయితే ఇప్పుడు కేటీఆర్ సిరిసిల్ల మీద ప్రత్యేకంగా ఫోకస్ పెట్టారు. పలు కార్యక్రమాలలో పాల్గొంటున్నారు. వారం వారం నియోజకవర్గానికి వెళ్తున్నారు. గతంలో కేటీఆర్ నెలకు ఒకసారి సిరిసిల్లకు వస్తే గొప్పగానే ఉండేది. అయితే ఇప్పుడు పూర్తిగా మారిపోయింది.గడిచిన 10 సంవత్సరాల కాలంలో కేటీఆర్ సిరిసిల్ల నియోజకవర్గం అభివృద్ధి పథంలో నడిపించానని చెప్పుకుంటారు. కానీ ఇప్పుడు సిరిసిల్లలో రాజకీయ పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ఇటీవల స్థానిక సంస్థలకు జరిగిన ఎన్నికల్లో ఆయన ఒక్కసారిగా ఆత్మ రక్షణలో పడిపోయారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.నియోజకవర్గంలో భారత రాష్ట్ర సమితి నల్లేరు మీద నడక మాదిరిగా గెలవలేదు. అధికార పక్షానికి పోటీ మాత్రమే ఇవ్వగలిగింది. అయితే ఈ ఫలితాలు కేటీఆర్ ను ఇబ్బందికి గురి చేశాయని వార్తలు వినిపిస్తున్నాయి. అధికారంలో ఉన్నప్పుడు సిరిసిల్ల నియోజకవర్గం లో కేటీఆర్ కు అనుకూలంగా అన్ని జరిగిపోయాయి. ఇప్పుడు పరిస్థితి మాత్రం అలా లేదు. కార్యకర్తలు ఇతర పార్టీలవైపు వెళ్ళడానికి ఆసక్తిగా ఉన్నారు. ఈ వలసలను అడ్డుకోవడానికి.. నాయకత్వంలో భరోసా నింపడానికి కేటీఆర్ ప్రయత్నాలు చేస్తున్నారని.. అందువల్లే ప్రజలలో ఉండాలని ఆయన భావిస్తున్నట్టు తెలుస్తోంది.అధికారం ఉన్నప్పుడు కేటీఆర్ అభివృద్ధి పై దృష్టిపెట్టారని.. అప్పట్లో ఆయన నాయకత్వం మధ్య సమన్వయం సాధించడంలో దృష్టి పెట్టలేదని.. అందువల్లే సిరిసిల్లలో గులాబీ పార్టీ నాయకుల మధ్య విభేదాలు పెరిగాయని ప్రచారంలో ఉంది. అందువల్ల కేటీఆర్ ప్రజల్లో ఉంటున్నారు. వారి మధ్య ఉన్న గ్యాప్ ను పూడ్చే ప్రయత్నం చేస్తున్నారు. రచ్చబండ లాంటి కార్యక్రమాల ద్వారా ప్రజల ను కలిసే ప్రయత్నం చేస్తున్నారు.సిరిసిల్ల అనేది తెలంగాణ రాష్ట్రంలో ఒక నియోజకవర్గం మాత్రమే కాదు. కేటీఆర్ కు బలమైన రాజకీయ కోట. ఆ కోట ఎప్పటికీ బలంగానే ఉండాలి. అలా కాకుండా పగుళ్లు ఏర్పడితే ఇబ్బందికరమైన వాతావరణం నెలకొంటుంది. భవిష్యత్ కాలంలో కేటీఆర్ నాయకత్వాన్ని ఆ పరిణామం ఇబ్బందికి గురిచేస్తుంది. అందువల్ల ఈ నష్టాన్ని పూడ్చడానికి కేటీఆర్ ఏకంగా నియోజకవర్గంపై దృష్టి పెట్టారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండ గడుతున్నారు .

# నిజామాబాద్‌లో మిస్టరీ డెత్

- గుండెపోటుతో భర్త చనిపోయినట్టు భార్య డ్రామా!

జయభేరి, నిజామాబాద్, జనవరి 5 :



నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం బోర్గాం (కే) గ్రామంలో గత నెలలో చోటు చేసుకున్న ఒక మరణం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారుతోంది. తొలుత గుండెపోటుగా భావించిన ఒక సాధారణ మరణం వెనుక 13 ఏళ్ల వైవాహిక బంధాన్ని కాలరాస్తూ ఒక భార్య పన్నిన కుతంత్రం దాగి ఉందని పోలీసులు ఛేదించారు. భర్తను అడ్డు తొలగించుకోవడానికి ప్రియుడితో కలిసి ఆమె స్కెచ్ వేసింది. సుపారీ ముఠాను పురమాయించింది. ఇలా ప్రతి అంశం సినిమా కథను తలపిస్తోంది.

**గుండెపోటు నాటకం- హడావుడిగా అంత్యక్రియలు**

బోర్గాం గ్రామానికి చెందిన పల్లాటి రమేష్ సౌమ్య దంపతులకు 13 ఏళ్ల కిందట వివాహమైంది. గత నెల 20న రమేష్ తన ఇంట్లో హఠాత్తుగా మరణించాడని, ఆయనకు గుండెపోటు వచ్చిందని సౌమ్య బంధువులను, గ్రామస్థులను నమ్మించింది. ఎటువంటి అనుమానం రాకుండా ఉండేందుకు ఏడుపులు, పెడబొబ్బలతో నాటకమాడి, అత్యంత హడావుడిగా అంత్యక్రియలు కూడా పూర్తి చేయించింది. భర్త అకాల మరణంతో అందరూ సౌమ్యను ఓదార్చారు. ఆమె కళ్లల్లో ఉన్న క్రూరత్వాన్ని పసిగట్టలేకపోయారు. రమేష్ మరణంపై తొలి అనుమానం ఇజ్రాయెల్‌లో ఉంటున్న ఆయన తమ్ముడు కేదారికి వచ్చింది. రమేష్ మృతదేహంపై, ముఖ్యంగా మెడ భాగంలో కొన్ని గాట్లు ఉన్నట్టు అక్కడి స్థానికులు కేదారికి ఫోన్ ద్వారా చెప్పారు. దీంతో అనుమానం వచ్చిన కేదారి గత నెల 21న విదేశాల నుంచి వచ్చాడు. మాక్లూర్ పోలీసులకు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. తన అన్న మరణం వెనుక ఏదో కుట్ర ఉందని ఆయన ఆరోపించారు. ఫిర్యాదుపై పోలీసులు సీరియస్‌గా దర్యాప్తు ప్రారంభించారు. 2న తాహసీల్దార్ సమక్షంలో రమేష్ మృతదేహాన్ని వెలికి తీశారు. పోస్టుమార్టం నిర్వహించిన వైద్యులు, అది సహజ మరణం కాదని, ఊపిరాడక పోవడం వల్ల జరిగిన హత్య అని తేల్చిచెప్పారు. దీంతో పోలీసులు సౌమ్యను అదుపులోకి తీసుకొని తమ స్టైల్‌లో విచారించగా అసలు విషయం చెప్పేసింది. నిజామాబాద్‌లోని ఒక ప్రైవేటు పాఠశాలలో సౌమ్య నాన్ టీచింగ్ స్టాఫ్‌గా పని చేస్తోంది. అక్కడే పని చేస్తున్న నందిపేట మండలం బాద్గుణకు చెందిన పీఈటీ నాలేశ్వర్ దిలీప్‌తో పరిచయం ఏర్పడింది. ఈ పరిచయం కాస్త వివాహేతర సంబంధానికి దారి తీసింది. వీరి వ్యవహారం రమేష్‌కు తెలియడంతో దంపతుల మధ్య గొడవలు మొదలయ్యాయి. తన సుఖానికి అడ్డుగా ఉన్న భర్తను ఎలాగైనా తొలగించుకోవాలి సౌమ్య తన ప్రియుడితో కలిసి ప్లాన్ చేసింది. సౌమ్య, దిలీప్ కలిసి రమేష్‌ను చంపడానికి గతేడాది ఆగస్టులోనే ప్రయత్నించారు. రమేష్ తన టూ వీలర్‌పై వెళ్తుండగా దిలీప్ తన కారుతో ఢీ కొట్టాడు. రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించి చంపాలని అనుకున్నారు. కానీ ఆ ప్లాన్ ఫెయిల్ అయ్యింది. ఈ ప్రమాదంలో రమేష్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

**బంగారు ఉంగరం తాకట్టు పెట్టి సుపారీ గ్యాంగ్‌కు పేమెంట్**

మొదటి ప్రయత్నం విఫలం కావడంతో ఈసారి ప్రొఫెషనల్ కిల్లర్స్ సహాయం తీసుకోవాలని సౌమ్య భావించింది. దీని కోసం తన బంగారు ఉంగరాన్ని 35వేల రూపాయలకు తాకట్టు పెట్టింది. ఆ డబ్బును సుపారీ గ్యాంగ్‌కు అడ్వాన్స్‌గా ఇచ్చింది. గత నెల 19న ప్లాన్ ప్రకారం రమేష్ తాగే మంచి నీటిలో 10 నిద్ర మాత్రలు కలిపి ఇచ్చింది. మత్తులోకి జారుకున్న రమేష్‌ను చంపడానికి సుపారీ గ్యాంగ్‌ను రమ్మని ఫోన్ చేసింది. కానీ ఆ సమయంలో గ్యాంగ్ సభ్యులు ఫోన్ ఎత్తలేదు. సుపారీ గ్యాంగ్ రాకపోవడంతో సౌమ్య ఆందోళనకు గురై ప్రియుడి దిలీప్‌కు సమాచారం ఇచ్చింది. దిలీప్ తన తమ్ముడు అభిషేక్‌త కలిసి రాత్రి సమయంలో సౌమ్య ఇంటికి వచ్చాడు. ముగ్గురూ కలిసి నిద్రలో ఉన్న రమేష్‌ను అతి దారుణంగా హత్య చేశారు. రమేష్ మెడకు టవల్ బిగించి దిండుతో ముక్కు, నోరు మూసి వేసి ఊపిరాడకుండా చేసి చంపేశారు. భర్త ప్రాణాలు పోతున్నా ఆ ఇల్లాలు కనికరం చూపలేదు.

**పోలీసుల అదుపులో నిందితులు**

నిజామాబాద్ ఏసీపీ రాజవెంకట్‌రెడ్డి వెల్లడించిన వివరాల ప్రకారం ఈ కేసులో ప్రధాన నిందితులుగా సౌమ్య, దిలీప్, అభిషేక్‌తోపాటు సుపారీ గ్యాంగ్‌కు చెందిన జితేందర్, శ్రీరామ్, రమావత్ రాకేష్‌ను అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరుపర్చారు. మరో నిందితుడు మోసిన్ పరారీలో ఉన్నాడు. నిందితులందరిపై హత్యా నేరం కింద కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

# నా కూతురికి జరిగిన అన్యాయం ఎవరికీ జరగకూడదు

జయభేరి, హైదరాబాద్ :



అమెరికాలో హత్యకు గురైన నికిత తండ్రి ఆనంద్ మీడియాతో మాట్లాడారు. చివరగా హ్యాపీ న్యూ ఇయర్ డాడీ అని చెప్పింది..అంటూ కన్నీరు మున్నీరయ్యాడు. నాలుగేళ్ళ క్రితం నా కూతురు అమెరికా వెళ్ళింది. నా కూతురు నిఖితను అర్జున్ శర్మా అనే యువకుడు హత్య చేశాడు. అర్జున్ శర్మ గతంలో నా కూతురు రూమ్మేంట్‌గా ఉన్నాడు. అందరినీ డబ్బులు అడిగి తీసుకునేవాడు. నా కూతురు దగ్గర నుండి కూడా డబ్బులు తీసుకున్నాడు అని అంటున్నారు. ఆడబ్బులు విషయంలోనే అడగడానికి అర్జున్ దగ్గరికి నికిత వెళ్లినట్లు ఆమె స్నేహితులు చెప్తున్నారు . ఆ తర్వాత నిఖితను హత్య చేసి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. అక్కడి నుండి ఇండియాకి పారిపోయి వచ్చాడు. నాలుగు సంవత్సరాల క్రితం అమెరికాకు నా కూతురు చదువుకోడానికి వెళ్ళింది ప్రస్తుతం జాబ్ చేస్తుందని అన్నారు. చివరిగా 31 వ తారీకు ఫోన్ చేసి న్యూ ఇయర్ విషెస్ చెప్పింది... అదే చివరి మాట. నా కూతురికి జరిగిన అన్యాయం ఎవరికీ జరగకూడదు. అధికారులు తన కూతురు మృతదేహాన్ని ఇండియాకి తీసుకొచ్చే ఏర్పాట్లు చేయాలని కోరుతున్నానని అన్నారు.





# రోడ్డు భద్రత వారోత్సవాలు

జయభేరి, చందంపేట :

రోడ్డు భద్రత వారోత్సవముల సందర్భముగా చందంపేట పోలీస్ సిబ్బంది జిల్లా పరిషత్ హై స్కూల్ చందంపేట విద్యార్థులచే ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా రోడ్డు నియమాలను పాటించవలెనని లైసెన్సు లేకుండా ఇన్సూరెన్స్ లేకుండా మద్యం తాగి వాహనలు నడపరాదని ఎక్కడపడితే అక్కడ రోడ్లను క్రాస్ చేయరాదని మైనరు బాలురు వాహనములు నడపరాదని, రోడ్డు నియమాలను దృష్టిలో ఉంచుకొని వాహనములు నడపాలని ఈ సందర్భంగా మన పెద్దవారిలో అవగాహన కల్పించాలని పోలీస్ సిబ్బంది విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమములో జిహెచ్ఎం పి లీలారాణి చందంపేట గ్రామ సర్పంచ్ సాదిక్, ఉపసర్పంచ్ శ్రీశైలం యాదవ్, చంద్రశేఖర్, గోవిందు కొండయ్య, జోసెఫ్, చౌదరి, ఎల్ మధు, రామచంద్రు, విజయ, సంధ్యారాణి, ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థు లచే ప్రతిజ్ఞ చేయించడం జరిగినది.



# నూతనంగా గెలుపొందిన సర్పంచ్ ను సన్మానించిన నాయకులు



జయభేరి, దేవరకొండ :

దేవరకొండ మండలం అమ్మటోని గూడెం నూతనంగా గెలుపొందిన సర్పంచ్ ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్వి రాష్ట్ర ఉపాధ్యక్షులు వేముల రాజు, బి ఆర్ ఎస్వి నియోజకవర్గం అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ, లకుమారపు మల్లయ్య, పాతులవత్ లక్ష్మణ్, పొట్ట మధు, హరిదాస్, జమీర్ బాబా, ఎర్ర విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిర మహిళ శక్తి క్యాంటీన్ ప్రారంభించిన ఎమ్మెల్యే నవీన్ యాదవ్

జయభేరి, హైదరాబాద్ :

హైదరాబాద్ మధురానగర్ లోని తెలంగాణ మహిళా సహకార సంస్థ ఆవరణంలో ఏర్పాటు చేసిన జై భవాని (SHG) ఇందిర మహిళా శక్తి క్యాంటీన్ ను జూబ్లీహిల్స్ శాసనసభ్యుడు నవీన్ యాదవ్, రాష్ట్ర మహిళా కార్పొరేషన్ ఛైర్ పర్సన్ బంద్రు శోభారాణి సెమవారం ప్రారంభించారు.




# అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు దుస్తుల పంపిణీ

జయభేరి, తుర్కపల్లి, జనవరి 05 :

తుర్కపల్లి మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు దుస్తుల పంపిణీ కార్యక్రమాన్ని సర్పంచ్ సోమల వెంకటేశం ప్రారంభించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు లేవని అంగన్వాడీ టీచర్ పుట్ట సునీత సర్పంచులు కోరగా ఆయన స్పందించి అంగన్వాడీ కేంద్రంలో మౌలిక సదుపాయాల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సర్పంచ్, ఉప సర్పంచ్లను సన్మానించారు. అనంతరం విద్యార్థి జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పల్లె నరేష్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి శైలజ, వార్డు సభ్యులు కర్ణాకర్, నజీర్, విజయ, రాజు, అంగన్వాడి టీచర్ భాగ్యలక్ష్మి, ఆశా వర్కర్ వరమ్మ, వరలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

# పాఠశాల విద్యార్థులకు క్రీడా దురుస్తుల బహుకరణ



జయభేరి, తుర్కపల్లి, జనవరి 05 :

తుర్కపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్గా విధులు నిర్వహిస్తున్న అనూష తండ్రి కొమరయ్య వ్యాయామ ఉపాధ్యాయులు జ్ఞాపకార్థం పాఠశాల విద్యార్థులకు 20 జతల క్రీడా దుష్టులను బహుకరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్. శ్రీనివాస్ మాట్లాడుతూ క్రీడల పైన ఉన్న ఆసక్తితో వారి తండ్రి పేరు మీద నిరుపేద విద్యార్థులకు ప్రోత్సాహం అందించిన అనూష అను అభినందించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని, ఈ విషయంలో చొరవ తీసుకున్న పిడి.ఎం చంద్రమౌళి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాస్ చారి, బిక్షమయ్య, విశ్వేశ్వర రావు, జ్యోతి, మాధురి, సుజాత, హరిత, అంబాజీ, విద్యార్థులు పాల్గొన్నారు.


# కుక్కల దాడిలో 15 గొర్రె పిల్లలు మృతి



జయభేరి, తుర్కపల్లి, జనవరి 05 :

కుక్కల దాడిలో 15 గొర్రె పిల్లలు మృతి చెందిన సంఘటన తుర్కపల్లి మండల కేంద్రంలో సోమవారం జరిగింది. తుర్కపల్లి మండల కేంద్రానికి చెందిన పసుల నరసయ్య కు చెందిన సుమారు 15 మేకపిల్లలు ఇంటి వద్ద కల దొడ్డిలో ఉంచి మేకల కాపరికి వెళ్ళాడు. మధ్యాహ్న సమయంలో కుక్కలు దాడి చేసి 15 మేకప్ పిల్లలను చంపినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వపరంగా ఆదుకోవాలని కోరారు. సంవత్సర కాలం పాటు కష్టపడి పోషించిన ఫలితం పోయిందని కన్నీటి పర్యంతమయ్యారు.

# ఉచిత పశువైద్య శిబిరం



జయభేరి, తుర్కపల్లి, జనవరి 05 :

తుర్కపల్లి మండలం పెద్దతండ గ్రామంలో పశుసంవర్ధక శాఖ, పశు గణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత పశుగర్భకోశ పరీక్ష చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచి బానోతు సుజాత బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ మోతిలాల్ మాట్లాడుతూ పశువులను ఈనిన తర్వాత మూడు నెలల్లో తిరిగి చూడు కట్టించుకోవాలని, కట్టని పశువులకు ఈ శిబిరంలో మందులు ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో 30 పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్సలు, 140 దూడలకు, గొర్రెలకు ఉచిత నట్టాల నివారణ మందులను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ రామచంద్రారెడ్డి, దత్తాయిపల్లి పశువైద్యాధికారి డాక్టర్ రామారావు, సిబ్బంది శేఖర్, రాఘవేంద్ర , శంషొద్దీన్, సూపర్వైజర్ భాను, గోపాలమిత్రలు పెండెం ప్రవీణ్, వీరు, బాలేష్, హర్ష, మహేష్ పాల్గొన్నారు.

# అమెరికాలో రోడ్డు ప్రమాదం

- పాలకొల్లుకు చెందిన దంపతులు మృతి

జయభేరి, పాలకొల్లు :

అమెరికాలోని వాషింగ్టన్ లో జరిగిన రోడ్డు ప్రమాదంలో పాలకొల్లుకు చెందిన దంపతులు కృష్ణకిశోర్, ఆశ మృతి చెందారు. కృష్ణ కిశోర్ కుమారుడు, కుమార్తె తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నిరు. మృతుడి కుటుంబం పది రోజుల క్రితమే పాలకొల్లుకి వెళ్లి వచ్చింది. మార్గమధ్యంలో దుబాయ్లో న్యూ ఇయర్ వేడుకలు జరుపుకుంది. ఇంతలోనే ప్రమాదం జరిగింది. కిశోర్ అమెరికాలో సాఫ్ట్ వేర్ ఇంజినీర్గా పనిచేస్తున్నారు.



# ప్రభాస్ ఒక్క రోజు భోజనం ఖర్చు ఎంతో తెలుసా..?

దివంగత రెబల్ స్టార్ కృష్ణంరాజు భార్య శ్యామలాదేవి తమ కుటుంబానికి సంబంధించిన ఎన్నో ఆసక్తికర విషయాలను ఇటీవల ఒక ఇంటర్వ్యూలో వెల్లడించారు. ముఖ్యంగా కృష్ణంరాజు, ప్రభాస్ ఆహారపు అలవాట్లు, వారి మధ్య అనుబంధం, కృష్ణంరాజు గొప్ప వ్యక్తిత్వం గురించి ఆమె వివరించారు. ప్రభాస్ కోసం షూటింగ్‌లకు ప్రత్యేకంగా పెద్ద క్యారియర్‌లలో ఇంటి వంటకాలను పంపేవారమని శ్యామలాదేవి తెలిపారు. కృష్ణంరాజు గారికి, ప్రభాస్ ఇద్దరికీ పులస చేపల పులుసు అంటే అమితమైన ఇష్టమని, ఇది వారికి పూర్వీకుల నుంచి వచ్చిన అలవాటు అని చెప్పారు. పులస దొరికితే వెంటనే ఇంటికి వచ్చేయాల్సిందేనని, ప్రభాస్ డైట్ లో ఉన్నప్పటికీ పులస పులుసు కోసం చీట్ డే తీసుకునేవారని ఆమె నవ్వుతూ గుర్తు చేసుకున్నారు. అయితే ప్రభాస్ ఓ సందర్భంలో ఫేవరెట్ డిష్ ఎప్పటికప్పుడు మారిపోతుందని చెప్పారు. బిర్యానీ, రొయ్యల కూర, అలాగే పులావ్, రసం, చేపల పులుసు కలిపి తినే కాంబినేషన్‌ను కృష్ణంరాజు బాగా ఇష్టపడేవారని, అతిథులకు స్వయంగా వడ్డించేవారని శ్యామలాదేవి పేర్కొన్నారు. కృష్ణంరాజు అతిథి మర్యాదలకు ప్రసిద్ధి అని, స్నేహితులు లండన్ నుంచి వచ్చినా వారి ఇష్టాలను అడిగి మరీ వంటలు చేయించి, స్వయంగా వడ్డించేవారని చెప్పారు. శ్యామలాదేవి తమ వివాహ బంధం గురించి మాట్లాడుతూ, కృష్ణంరాజు తనకు మొదటిసారి కొనిచ్చిన రెండు చీరలను ఇప్పటికీ జాగ్రత్తగా దాచుకున్నానని అన్నారు. ప్రభాస్, కృష్ణంరాజు మధ్య ఉన్న బలమైన బంధం గురించి కూడా ఆమె మాట్లాడారు. ప్రభాస్ పెదనాన్నను చూడటానికి వచ్చే ముందు రెండు గంటల ముందు ఫోన్ చేసి, ఎక్కువ సేపు కూర్చుంటానని చెప్పేవారని శ్యామలాదేవి వివరించారు. కృష్ణంరాజు మరణానంతరం కుటుంబం తీవ్ర నిరాశలోకి వెళ్ళినప్పుడు, ప్రభాస్ వారికి ఎంతో అండగా నిలిచారని ఆమె గుర్తు చేసుకున్నారు. "పెదనాన్న ఎక్కడికీ వెళ్ళలేదు, సంపూర్ణమైన జీవితం అనుభవించి మన దగ్గరే ఉన్నారు. మీరు బాధపడితే ఎవ్వరూ మీ దగ్గరకు రారు. మీరు పెదనాన్న ఉన్నట్టుగా అందరికీ కనిపించాలి" అని ప్రభాస్ తనకు ధైర్యం చెప్పాడని శ్యామలాదేవి తెలిపారు. కృష్ణంరాజు సినీ, రాజకీయ జీవితాలను సమర్థవంతంగా బ్యాలెన్స్ చేసుకున్నారని, ఇప్పటికీ ఇరు రంగాల ప్రముఖులు తమ కుటుంబానికి ఎంతో గౌరవం ఇస్తున్నారని శ్యామలాదేవి సంతోషం వ్యక్తం చేశారు. కనిపించిన మనిషి ఎవరైనా సరే.. వారికి భోజనం పెట్టడం ప్రభాస్ స్టైల్. అలా అని ఒకటి అరా వంటకాలు కాదు.. పేర్లు చెప్పడానికే పావు గంట పట్టేలా ప్రభాస్ వారికి భోజనాలు పంపిస్తాడు. అంతేకాదు.. ప్రభాస్ షూటింగ్ సెట్ లో ఉన్నా ఒక్కడే తినడు. చుట్టూ ఉన్న 10, 20 మందితో కలిసి భోజనం చేస్తాడు. ఇంకొన్నిసార్లు అయితే సెట్ లో ఉన్నవాళ్లందరికీ కూడా ప్రభాస్ ఇంటి నుంచి భోజనాలు వస్తుంటాయి. ఆయన భోజనం ఎలా పెడతారో ఇప్పటికే ఎంతో మంది సెలబ్రిటీలు చెప్పారు. అందుకే ప్రభాస్ కోసం స్పెషల్ కుకింగ్ టీం ఉందని వినికిడి. వీళ్లు ఓ రోజులో ప్రిపేర్ చేసి ఫుడ్ విలువ దాదాపు రూ.2 లక్షల వరకు ఉంటుందని ఇండస్ట్రీలో టాక్. ప్రభాస్ మనస్తత్వం మనకు తెలిసిందే. ఇంతకంటే ఖర్చు ఎక్కువ అవ్వొచ్చు కానీ తక్కువ మాత్రం అయ్యే చాన్స్ లేదు. ఎందుకంటే మటన్, చికెన్, చేపలు, రొయ్యలు, పీతలు.. వాటితో వివిధ రకాల కాంబినేషన్స్.. రోజుకు అంతమందికి అంటే.. ఆ మాత్రం ఖర్చు ఉంటుందిలే!

# శ్రీరామనవమికి వారణాసి?



మహేష్‌బాబురాజమౌళి కాంబినేషన్‌లో రూపొందుతున్న గ్లోబల్ యాక్షన్ అడ్వెంచర్ మూవీ 'వారణాసి' ప్రస్తుతం నిర్మాణ దశలో ఉంది. గత నెలలో హైదరాబాద్‌లో నిర్వహించిన గ్లోబ్‌ట్రాటర్ ఈవెంట్ సినిమాపై దేశవ్యాప్తంగా అంచనాలను పెంచింది. దాదాపు 1300కోట్ల భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు ప్రచారం జరుగుతున్నది. భారతీయ పురాణాల నేపథ్యంలో సాగే ఈ సాహసగాథను విజువల్ వండర్‌గా తెరపై ఆవిష్కరించేందుకు దర్శకధీరుడు రాజమౌళి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. హాలీవుడ్ నిపుణులు పనిచేస్తున్న ఈ సినిమాలోని కొన్ని సీక్వెన్స్ అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో ప్రేక్షకులను అబ్బురపరుస్తాయని చెబుతున్నారు.

ఇదిలావుండగా ఈ సినిమా రిలీజ్‌పై గ్లోబ్‌ట్రాటర్ ఈవెంట్‌లోనే రాజమౌళి క్లారిటీ ఇచ్చారు. 2027 వేసవిలో ప్రేక్షకుల ముందుకుతీసుకొస్తామని చెప్పారు. తాజా సమాచారం ప్రకారం 'వారణాసి' విడుదల తేదీని కూడా మేకర్స్ నిర్ణయించారని వార్తలొస్తున్నాయి. శ్రీరామనవమి సందర్భంగా వచ్చే ఏడాది ఏప్రిల్ 9న ఈ చిత్రాన్ని రిలీజ్ చేయబోతున్నారని సమాచారం. ఐమాక్స్ ఫార్మాట్‌తో చిత్రీకరిస్తున్న ఈ సినిమాను పలు భారతీయ భాషల్లో విడుదల చేయబోతున్నారు. ప్రియాంకచోప్రా, పృధ్వీరాజ్ సుకుమారన్ తదితరుల ప్రధాన పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కీరవాణి సంగీతాన్నందిస్తున్నారు.

# సూపర్ నాచురల్ కథలో 'నాగిన్'..:



బాలీవుడ్ అగ్ర కథానాయిక శ్రద్ధా కపూర్ ఈ ఏడాది భారీ సినిమాల్లో భాగమవుతున్నది. ప్రస్తుతం ఆమె మరాఠీ నృత్యకారిణి, గాయని వితాబాయి జీవిత కథ ఆధారంగా రూపొందిస్తున్న 'ఈతా' చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే. 'ఛావా' ఫేమ్ లక్ష్మణ్ ఊటేకర్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా పూర్తయిన వెంటనే ఆమె 'నాగిన్' అనే సూపర్ నాచురల్ ఫిల్మ్‌లో నటించబోతున్నది. ఐదేళ్ల క్రితమే ఈ సినిమాకు బీజం పడింది. అయితే అనివార్య కారణాల వల్ల సెట్స్‌పైకి రాలేదు. తాజా సమాచారం ప్రకారం ఏప్రిల్‌లో ఈ సినిమా షూటింగ్ మొదలు కానుందని తెలిసింది. ఇందులో శ్రద్ధాకపూర్ నాగిని పాత్రలో కనిపించనుంది. భారీ గ్రాఫిక్స్ హంగులతో రూపొందే ఈ చిత్రంలో ఐకానిక్ నాగిని పాత్రను సరికొత్త పంథాలో ఆవిష్కరించబోతున్నట్లు తెలిసింది.

# ఆఫర్స్ నిల్.. అయినా 6 నిమిషాలకు 6 కోట్లు..



వరుస విజయాలను అందుకుని స్టార్ హీరోయిన్‌గా మారిపోయింది. సౌత్ టూ నార్త్.. అన్ని వర్గాల ప్రేక్షకులను తన నటనతో మెప్పించింది. దాదాపు రెండు దశాబ్దాలుగా సినీరంగంలో చక్రం తిప్పుతున్న ఈ ముద్దుగుమ్మకు.. ఇప్పుడు మెయిన్ హీరోయిన్ లీడ్ రోల్ ఆఫర్స్ తగ్గిపోయాయి. చాలా కాలంగా ఆమె కేవలం స్పెషల్ పాటలతోనే నెట్టుకోస్తుంది. అటు హిందీలో మాత్రం ఈ అమ్మడు డిమాండ్ వేరేలెవల్ లో ఉంది. ఇటీవలి కాలంలో స్పెషల్ సాంగ్స్ చేస్తూ తనదైన మార్క్ క్రియేట్ చేసుకుంది. జైలర్ సినిమాలో కావాలయ్యా పాటతో మరింత పాపులర్ అయ్యింది. కొన్ని రోజుల క్రితం హిందీలో ఆజ్ కీ రాత్ అనే పాటతో మరింత రచ్చ చేసింది. ఇటీవల రైడ్ 2 సినిమాలో తమన్నా నషా పాటలో మతిపోగొట్టేసింది. ఈ సాంగ్ సోషల్ మీడియాలో తెగ ట్రెండ్ అయ్యింది. అయితే ఈ పాటకు దాదాపు రూ.5 కోట్ల వరకు పారితోషికం తీసుకున్నారని టాక్. ఇక ఇప్పుడు వినిపిస్తున్న సమాచారం ప్రకారం తమన్నా మరోసారి తన రెమ్యునరేషన్ పెంచేసిందట. ఇటీవల గోవాలో జరిగిన ఓ ఈవెంట్ లో 6 నిమిషాల డ్యాన్స్ కోసం దాదాపు రూ.6 కోట్లు తీసుకుందట. ఇప్పుడు ఇదే న్యూస్ ఫిల్మ్ వర్గాల్లో వైరలవుతుంది. సినిమాలు లేకపోయినా.. తమన్నా డిమాండ్ చూసి ఆశ్చర్యపోతున్నారు ఫ్యాన్స్.

# ఒకే స్టేజ్ పై వెంకటేశ్, చిరంజీవి.. మన శంకరవరప్రసాద్ గారు ప్రీ రిలీజ్ ఈవెంట్



మోస్ట్ అవైటెడ్ ఫిల్మ్ మన శంకరవరప్రసాద్ గారు. గతేడాది సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న డైరెక్టర్ అనిల్ రావిపూడి.. ఇప్పుడు ఈ సినిమాతో మరోసారి సక్సెస్ అయ్యిందుకు రెడీ అయ్యారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో మెగాస్టార్ చిరంజీవి హీరోగా నటిస్తున్న ఈ సినిమా పై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. చాలా కాలం తర్వాత చిరు నటిస్తున్న పక్కా ఫ్యామిలీ ఎంటర్టైనర్ ఇది. ఈ సినిమాపై ఇప్పటికే మంచి హైప్ నెలకొంది. ఇందులో లేడీ సూపర్ స్టార్ నయనతార కథానాయికగా నటిస్తుండగా.. అతిథి పాత్రలో కనిపించనున్నారు విక్టరీ వెంకటేశ్. చిరు, వెంకీ ఒకే సినిమాలో కనిపించడడంతో ఈ మూవీ చూసేందుకు అడియన్స్ ఎంతో ఆసక్తిగా వెయిట్ చేస్తున్నారు. ఇప్పటికే రిలీజ్ అయిన పోస్టర్స్, ట్రైలర్, టీజర్ ఆకట్టుకున్నాయి. ఈ సినిమాను సంక్రాంతి పండక్కి జనవరి 12న రిలీజ్ చేయనున్నారు. ఇప్పటికే మన శంకరవరప్రసాద్ గారు సినిమా ప్రమోషన్స్ షూరు చేసింది చిత్రయూనిట్. మరోవైపు విభిన్న కంటెంట్ అంశాలతో.. తనదైన స్టైల్లో వరుసగా ప్రమోషన్ వీడియోస్ షేర్ చేస్తున్నారు డైరెక్టర్ అనిల్ రావిపూడి. తాజాగా ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ డేట్ అధికారికంగా ప్రకటించింది మూవీ టీమ్. ఈ వేడుకను జనవరి 7న హైదరాబాద్ లో నిర్వహించనున్నారు. ఈ వేడుకకు చిరుతోపాటు వెంకీ సైతం రానున్నారట. ఇద్దరు కలిసి ఒకే స్టేజ్ పై ప్రేక్షకులను అలరించనున్నారు. వీరితోపాటు లేడీ సూపర్ స్టార్ నయనతార సైతం రానున్నట్లు తెలుస్తోంది. మొత్తానికి గతేడాది సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో భారీ హిట్టు అందుకున్న వెంకీ.. ఈసారి చిరుతో కలిసి ప్రేక్షకులను ఎంటర్టైన్ చేయడానికి వస్తున్నారు. ఈ ఏడాది సంక్రాంతి బరిలో 7 సినిమాలు ఉన్న సంగతి తెలిసిందే.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**